# హాస్యానందం

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

23వ నవ్వుల వసంతం

సంపూర్ణ హాస్య మాసపత్రిక మార్చి-2026 ₹25






బంగార్తల్లి పురస్కారం-2026

పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక ఉగాది కొసమెరుపు మినీ హాస్య కథల పోటీ ఫలితాలు

NCCF విశాఖపట్టణం వారు నిర్వహించిన కార్టూన్ పోటీ ఫలితాలు

సిగ్గులేకపోతే...?! అంశంతో నిర్వహించిన కార్టూన్ పోటీ ఫలితాలు

# ఆహ్వానము



## మా మాతృమూర్తి
## దివ్యశ్రీ జంబువతి గారిని స్మరిస్తూ
## ప్రతి ఉగాదికి హాస్యానందం అందించే
## వార్షిక పురస్కారం

# బంగార్తల్లి పురస్కారం-2026

**10,000 రూపాయల నగదు బహుమతి, జ్ఞాపిక, సన్మాన పత్రం**

**2026 బంగార్తల్లి పురస్కారం- స్వీకర్త**

డి.టి.పి. రంగంలో ఇరవై వసంతాల అక్షరశిల్పి

**శ్రీమతి తోటకూరి లక్ష్మిగారు.**



ఇంకా ఈ సభలో...



పాలపర్తి రాజగోపాల్,
ఉమాదేవి స్మారక
ఉగాది కొసమెరుపు
మినీ హాస్య కథల పోటీలో
విజేతలకు బహుమతి
ప్రదానం!

NCCF విశాఖపట్టణం వారు
నిర్వహించిన
కార్టూన్ పోటీలో
విజేతలకు బహుమతి
ప్రదానం!

సిగ్గు
లేకపోతే...



అంశంతో నిర్వహించిన
కార్టూన్ పోటీలో
విజేతలకు బహుమతి
ప్రదానం!

### ముఖ్య అతిథులు

డా॥ జి.కృష్ణవేణి, ప్రిన్సిపాల్, కె.బి.ఎన్.కాలేజి, విజయవాడ
శ్రీ లంక లక్ష్మీనారాయణ, అధ్యక్షులు, యువకళావాహిని, హైదరాబాద్
శ్రీమతి గోవిందరాజుల సుభద్ర, డైరెక్టర్, బాలభవన్, నెల్లూరు
శ్రీమతి స్వర్ణలత భారత, డైరెక్టర్, నాట్యనిలయం, విజయవాడ
శ్రీ బాచి , అధ్యక్షులు, ఆం.ప్ర. కార్టూనిస్టుల సంఘం
శ్రీ పాలపర్తి శ్రీకాంత శర్మ , కథల పోటీ నిర్వాహకులు
శ్రీ కె.వి.వి.సత్యనారాయణ , హాస్యానందం ఆప్తులు

మార్చి
22
2026

వేదిక: కె.బి.ఎన్. కాలేజి ఆడిటోరియం,విజయవాడ
సమయం: సా॥ 6గంటలకు

కె.బి.ఎన్ కాలేజి అభినందనలతో...

సభానంతరం విందు

**నృత్య ప్రదర్శన : చిరంజీవి వై.ఎల్.వి.ఎన్. సత్యశ్రీ**

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం

మార్చి-2026

23 వ సంవత్సరం ✦ 261 వ సంచిక

సంవత్సర చందా-రూ.300/-
2 సంవత్సరాల చందా-రూ.600/-
జీవిత చందా- రూ.5000/-

**Publisher& Editor-Ramu.P**

Editorial Office: **HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam, **YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist. *Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

*FullPillar* : Bnim

*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*

Dr. K.Ramakrishna, Jaydev, Sarasi, Krishna, Nagisetty, Sangram, GopalKrishna, Bomman, Harikrishna, Gandhi, Dayakar, Venkat, Kandlakunta SarathChandra Vadlamannati Gangadhar.

*D.T.P:*

P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:*
Surya

**Hyderabad & Secunderabad Distributor:**

M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad -01
**Ph: 9666680857, 6301072906.**

*Well Wishers:*

Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Akshagna Vidya Venkat
Dr.V.V.Rama Kumar
Dr.Surepalli Vijaya

*Prize Sponsers*

K.V.V.Satyanarayana
P.Srikanth Sarma
NCCF, Visakhapatnam
Akshagna Publications
K.Sundaresayya & Satyavathi
*Cartonist* JSR
Md.Raj Mohammed
Nimmi Madhubala



# ఎక్కడెక్కడ ఏమున్నాయి?...


పాలపర్తి రాజగోపాల్,
ఉమాదేవి స్మారక
ఉగాది కొసమెరుపు మినీ హాస్య కథల
పోటీలో బహుమతి పొందిన కథలు
17-32

పరాభవ నామ
సంవత్సర రాశి ఫలాలు
కండ్లకుంట శరత్‌చంద్ర
7


సిగ్గులేకపోతే...?!
అంశంతో నిర్వహించిన
కార్టూన్ పోటీ ఫలితాలు
34-36

NCCF
విశాఖపట్టణం వారు
నిర్వహించిన జాతీయస్థాయి
కార్టూన్ పోటీల ఫలితాలు
44-47







## ఈ సంచికలో కార్టూనిస్టులు

- జయదేవ్
- సరసి
- బొమ్మన్
- గోపాలకృష్ణ
- కృష్ణ
- నాగిశెట్టి
- భగవాన్
- ప్రసిద్ధ
- సుజయ్‌కృష్ణ
- ఆర్కే
- మన్నవప్రియా సిస్టర్స్
- చక్రవర్తి
- గిరి
- టి.ఆర్.బాబు
- భాను
- ప్రసాద్ కాజ
- వినోద్
- పెండేల
- గుత్తుల శ్రీనివాస్
- సునీల్
- ఎమ్.రాము
- కన్నాజీరావు
- రఘు
- పద్మ
- ప్రేమ్
- సురేంద్ర


## సీరియల్స్

కొంగుచాటు కృష్ణుడు
యండమూరి వీరేంద్రనాథ్ & యర్రంశెట్టి శాయి -12

సినిమా తీద్దామా?
గొలుసు సీరియల్ -40

## శీర్షికలు

| | | |
|---|---|---|
| కొత్త పుస్తకం | | -33 |
| స్మైల్‌స్టార్స్ | హరి | -38 |
| పదానందం | పోపూరి విశ్వనాథ్ | -50 |



## కార్టూన్ శీర్షికలు

| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -14 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -15 |
| ప్రొఫెషనల్ ఫన్ | -నాగిశెట్టి | -14 |
| పంచ్ ఫ్రేమ్ | -కృష్ణ | -16 |
| బుడ్డోడు | -సుజయ్ కృష్ణ | -16 |
| సామెతలు-సందర్భాలు | -ఆర్కే | -37 |
| రిటైర్డ్‌లైఫ్ | -బొమ్మన్ | -49 |
| హే భగవాన్ | -భగవాన్ | -43 |
| నవ్వే మందు | -ప్రసిద్ధ | -42 |




గమనిక:
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు...**
**సన్నిహితులకు ఉగాది శుభాకాంక్షలు!**


**మ**రో కొత్త వసంతంలోకి ఎన్నో ఆశలతో, ఆశయాలతో అడుగు పెడుతున్నాం! భావానికి, భావుకత్వానికి, ఆనందానికి, ఆహ్లాదానికి ఆలాంబన ఉగాది! ఈ సృష్టిలో ఎన్నో ప్రతిభా పాటవాలతో విరాజిల్లుతున్న ఎంతో మంది కళాకారులు ఉన్నారు. వీరందరూ ఒప్పుకున్న ఒప్పుకోకున్నా 'గుర్తింపు' కోరుకోవటం సహజం. కానీ చాలామంది కళాకారులకు ఈ 'గుర్తింపు' లభించటం లేదు! ఇక్కడ మరో ముఖ్యమయిన విషయం... మన సమాజంలో ఇప్పటికీ 'స్త్రీ' లకు దక్కాల్సిన గౌరవం దక్కడం లేదు. ఒక కుటుంబాన్ని, సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసే 'స్త్రీ'ల ప్రతిభని గ్రహించి, 'ఆ' గుర్తింపుని 'ఇవ్వటం' మన కనీస ధర్మం! మనలో ఆలోచనలకు బీజమైన అమ్మ మనసు ఎలా ఉంటుందో ఒక్కసారి మననం చేసుకుంటే... నిజం మనకి సాకారమవుతుంది. ఆ స్ఫూర్తితోనే...అందరూ బాగుండాలని శుభాకాంక్షలందించే **ఉగాది నాడు** మా అమ్మ పుట్టిన్రోజు సందర్భంగా ప్రచురణ రంగంలో విశేష సేవలందిస్తున్న మరో అమ్మకు **'బంగారుతల్లి'** పురస్కారం ఇచ్చి గత నాలుగేళ్ళుగా హాస్యానందం గౌరవిస్తోంది. ఈ ఏడాది టైపిస్ట్‌గా కెరీర్ మొదలెట్టి... డి.టి.పి ఆపరేటర్‌గా గత 20 ఏళ్ళ నుండి ఎన్నో పుస్తకాలకు రూపకల్పన చేస్తున్న **శ్రీమతి తోటకూరి లక్ష్మి**(న్యూ పాల్వంచ) గారికి ముద్రణ రంగానికి చెందిన ప్రముఖ మహిళామణిగా గుర్తిస్తూ... ఈ సంవత్సరం 'బంగారుతల్లి' పురస్కారాన్నిస్తూ గౌరవిస్తున్నాం.

అలాగే మా శ్రేయోభిలాషి 'సాంస్కృతిక సౌజన్య ప్రదాత'– **డా॥ కె.వి.రమణగారు,** తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోగా బాధ్యతలు నిర్వహించినప్పుడు, మహాకార్యాలను 'స్వామి' ఎలా సుసాధ్యం చేయించాడో... తమ అనుభవాలను ఆవిష్కరించిన **'హరే శ్రీనివాస'** పుస్తకం ఈ ఉగాదికి హాస్యానందం' జీవిత చందాదారులకు కానుకగా ఇవ్వడానికి నిర్ణయించాము. వేంకటేశ్వరుని కరుణా కటాక్షాలు అందరిపై ప్రసరింపజేయాలని ప్రార్థిస్తూ... అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...






తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో గా
పని చేసే అవకాశం లభించడమే
అదృష్టం అంటారు...
**డా॥ కె.వి. రమణ గారు.**
ఆ సేవా భాగ్యంలో ఎన్నెన్నో
మహనీయ అద్భుతాలు.
ఆ అద్భుతానుభవాల పుస్తకరూపం-
**హరే శ్రీనివాస**
హాస్యానందం జీవిత చందాదారులకు
**శుభాకాంక్షలతో**
**ఉగాది కానుక**



ఈ పంచాంగం మార్కెట్‌లో దొరకదు.
హాస్యప్రియత్వం సహజ గుణంగా ఉన్నవాళ్ళకే ఈ యోగం!




**హాస్యానందం ఆస్థాన జ్యోతిష్కులు- జ్యోతిష(బ్రహ్మ, భవిష్యద్రష్ట 'శ్రీశ్రీశ్రీ నిత్యనిష్ఠ గ్రహాంతర సిద్ధాంతి గారు' అంతరిక్షంలో స్థిర పడిపోయి, లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో సీక్రేట్‌గా గ్రహాల గమనాలను గమనించి ఈ గ్రహచారాలను మన పాఠకులకు అందిస్తున్నారు.**

**అందరికీ వర్తించే గ్రహానుగ్రహాలు:**

**ఆదాయం:** ఆర్జించినంత!
**వ్యయం:** EMI పుణ్యమా అని కాస్త ఎక్కువే!
**రాజపూజ్యం:** మీ భజన బట్టి...
**అవమానం:** మీ ప్రవర్తన బట్టి...


ఈ ఫలితాలను డౌన్‌లోడ్ చేసి, తెలుగులోకి తర్జుమా చేసి అమెరికా నుంచి మనకందించినవారు: **కంద్లకుంట శరత్‌చంద్ర**

గమనిక: మీరాశి ఫలితాలే కాకుండా ఇతరుల ఫలితాలు కూడా చదవటం వలన మీకు ఆనందయోగం కలుగుతుంది!

Cartoons: nagisetty

## మేష రాశి

**ఈ** 'పరాభవ'నామ సంవత్సరం మీకు ఎలాంటి పరాభవాలు లేకుండా, సంతోషంగా గడుపుతారని సప్తమంలో ఉన్న గురుడు చెబుతున్నాడు. ఈ సంవత్సరం మీ ఎనర్జీ లెవల్స్ సూపర్ హై ఉంటాయి, కానీ ట్రాఫిక్ సిగ్నల్స్ మాత్రం మీ సహనాన్ని పరీక్షిస్తాయి. ఎర్ర లైటు పడగానే ఎగిరెగిరి పడకుండా, శాంతంగా ఉండండి చాలు! వీరికి, ఎండా కాలంలో చెమట, వర్షాకాలంలో జలుబు, చలికాలంలో చలి, వస్తాయని అష్టమ స్థానంలో ఉన్న శనికళ చెప్పకనే చెప్తోంది. టివి సీరియళ్ళు, టివి న్యూస్ తగ్గిస్తే మీ బిపి కంట్రోల్‌లో ఉంటుంది.



మీ ఆఫీసులో, మీరు ఏదైనా ఐడియా చెప్పగానే, అందరూ "ఇది సూపర్!" అంటారు. తర్వాత , దాన్ని ఎవరో ఇంకొకరి పేరుతో ప్రెజెంట్ చేసేస్తారు. కాబట్టి కాస్త ఆచి తూచి వ్యవహరించండి. భార్యతో గొడవపడితే మాత్రం, సైలెంటుగా తలాడించడం మరవకండి.

కుటుంబంలో మీ వల్ల నవ్వులు పూస్తాయి, కొన్నిసార్లు తెలియకుండానే కొన్ని పంచ్ డైలాగులు కూడా పడతాయి. అది, రెగ్యులర్‌గా హాస్యానందం కామెడీ పత్రిక చదవడం వల్ల వచ్చిన ప్రతిభ అని గుర్తించండి!

ఎవరైనా "ఏం చేస్తున్నావ్?" అని అడిగితే "బిజీగా ఉన్నా" అంటూ ఫోన్‌లో రీల్స్ చూస్తూ ఉండకండి. ఫోన్ కాస్త పక్కనపెట్టి, మనుషులతో మాట్లాడుతూ ఉండండి. అప్పుడే మిమ్మల్ని నవగ్రహాలు అనుగ్రహిస్తాయని మీ జాతకం ఘోషిస్తోంది.

**కామెడీ పరిహారం:** ప్రతిరోజూ అద్దం ముందు నిలబడి మీకు మీరు 2 సార్లు "ఈ సంవత్సరం నేను సోషల్ మీడియాలో తక్కువగా ఉంటాను!" అనుకోండి చాలు!

## వృషభ రాశి

**ఈ** యేడు మీకు ఏ సమస్యలూ రావు...నేను చెప్పినవి పాటిస్తే చాలు! స్వీట్లు బెస్ట్ ఫ్రెండ్‌లా కనిపిస్తాయి. మీకు కేక్, స్వీట్లు కనిపించగానే 'ఇవి నాకోసమే పుట్టాయి' అనిపిస్తుంది. లపక్ లపక్‌మని తినాలనిపిస్తుంది. అది డయాబెటిస్ రాక్షసి మీకు



పెట్టబోయే పరీక్ష. కాబట్టి వాటిని కాస్త దూరం పెట్టి, ఆరోగ్యంగా ఉండండి. మీ మాటలు కొన్నిసార్లు మోటివేషనల్ స్పీచ్‌లా ఉంటాయని మీరు అనుకుంటారు, కానీ వినేవారికి స్టాండప్ కామెడీలా అనిపిస్తాయని ఆరో గడిలో ఉన్న చంద్రుడు చెబుతున్నాడు. కాబట్టి, కొంచం జాగ్రత్త!

**కామెడీ పరిహారం:** ప్రతీ శుక్రవారం, మీ పర్సులో ఉన్న డబ్బును, మీ ఫోన్‌లో ఉన్న గూగుల్‌పేను చూస్తూ “ఆ! హాస్యానందం రాశి ఫలాలలో చెప్పింది నాకు గుర్తుంది...గుర్తుంది!” అనే మంత్రం జపించాలి. వారంలో 6 రోజుల 23 గంటల 59 నిమిషాలు స్వీట్లకు దూరంగా ఉంటాను-అని అప్పుడప్పుడు అనుకోవాలి.

## మిథున రాశి

**ఈ** ఏడాది, రాహు గ్రహ ప్రభావం వల్ల, ఒకే విషయాన్ని మూడు యాంగిల్స్‌లో అద్భుతంగా చెప్పి... నాలుగో యాంగిల్‌లో మాత్రం కన్ఫ్యూజ్ చేస్తారు. కాబట్టి, మరీ ఎక్కువగా ఆలోచించీ చించీ ఇబ్బంది పడకుండా, ఒకటి రెండు కోణాలలో ఆలోచించండి చాలు. శుభం! మీ అయిడియాలు చాలా గొప్పగా ఉంటాయి, అయితే అవి అమలు చేసేలోపు, మరో కొత్త అయిడియా పుడుతుంది. దాంతో ఏది అమలు చేయాలో తెలీక తికమక మకతిక పడే ఛాన్స్ ఉంది. కాబట్టి, వచ్చిన మంచి అయిడియాను ముందుగా అమలు చేయండి. సుఖం!




మీ ఫోన్‌లో 132 చదవని మెసేజులు, 156 నోటిఫికేషన్స్ ఉంటాయి. వాటిలో 2 మాత్రమే చదివి, మిగతావి ‘ఆ! తర్వాత చూద్దాంలే’ అని ఆలస్యం చేస్తారు. ఈలోపు ప్రవాహంలా మరో 112 మెసేజులు వస్తాయి.

**కామెడీ పరిహారం:** వారానికి ఒక రోజు పూర్తి మౌనవ్రతం, రెండు రోజులు అర మౌనవ్రతం, మూడు రోజులు పావు మౌనవ్రతం పాటించాలి.

## కర్కాటక రాశి

**మీ** పక్కింటి వాళ్ళకు పోయిన యేడాది మీరు అప్పుగా ఇచ్చిన గ్లాసుడు కందిపప్పు, గిద్దెడు చక్కెర, రెండు టీ స్పూన్ల కాఫీ పొడి, ఈ సారి వారు తిరిగి ఇచ్చే అవకాశం ఉందని మీ గోచారం చెబుతోంది. చిన్న మాటకే ఫీలైపోతారు, పెద్ద విషయాలకు మాత్రం హ్యాపీగా నవ్వేస్తారు. అంచేత, కాస్త వెబ్‌సిరీస్‌లు చూడడం తగ్గించి కాస్త పాత పుస్తకాలు చదవమని గురు గ్రహం ఘోషిస్తోంది. కొంతమందికి సి.ఎం సీటు మీద, కొంతమందికి పి.ఎం సీటు మీద కన్ను ఉన్నట్టు... మీకు మీ ఇంట్లో సోఫా పై కన్ను ఉంటుంది. ఈ ఏడాది మీ ఫేవరెట్ సీట్ అదే! అక్కడే కూర్చుని టీవీ చూస్తూ ‘ఇది నా స్పేస్’ అని ఫీల్ అవుతారు. టివి రాక్షసి మిమ్మల్ని అయస్కాంతంలా పట్టేసే సూచనలు ఉన్నాయి కాబట్టి...జాగ్రత్తండీ! రోజూ అరగంట వాకింగ్ చేయండి చాలు!



**కామెడీ పరిహారం:** మీ ఇంటి మీద కాకులు వాలకుండా దిష్టి బొమ్మ పెట్టండి. సమస్య కాకులతో కాదు..అవి అరిస్తే మీ ఇంటికి చుట్టాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అందుకని అన్నమాట!

## సింహ రాశి

**వాట్సాప్** గ్రూపుల్లో జోక్ చెప్పిన వ్యక్తిని పట్టుకుని, “ఏయ్! అది నా జోక్. నా మైండ్‌లోనే ఉంది. నేను ముందు చెప్పాల్సింది. కాబట్టి క్రెడిట్ నాకే!” అని క్లెయిమ్ చేస్తారు. అది మీ సూపర్ పవర్! కాబట్టి, ఆలస్యం అమృతం విషం అనే సామెత పాటించండి చాలు... ఇక మిమ్మల్ని ఎవరూ ఆపలేరు. మీ వ్యక్తిత్వం, ప్రవర్తన ఈ సంవత్సరం కూడా రాయల్‌గా ఉంటాయి, కానీ పరిస్థితులు మిమ్మల్ని కామన్‌మేన్‌లాగా నడిపిస్తాయి! బుధ గ్రహం ఎప్పుడూ మీ వెంటే ఉండి నడిపిస్తుంది. మీ పవర్ దెబ్బకు, కొన్ని సమస్యలు కూడా భయపడి పారిపోతాయి.



**కామెడీ పరిహారం:** నలభై కేజీల మామిడి పళ్ళు కొని, ఏప్రిల్-మే నెలల్లో పేదలకు పంచండి. అన్నట్టు, మా బావమరిదికి మామిడి తోట ఉంది. కావాలంటే డిస్కౌంట్ ఇప్పిస్తాను! అద్దంలో చూసుకుని, ఎవరికీ వినిపించకుండా, రోజుకు ఒకసారి ‘నేను బాస్! బాస్ ఈజ్ బ్యాక్!’ అని చెప్పుకోవాలి.

## కన్యా రాశి


**ఈ** ఏడాది ఎలా గడుస్తుందో చెప్పాలంటే, చిన్న ఉదాహరణ ఇస్తాను. రెస్టారెంట్ కు వెళ్ళి తింటారు. బిల్ చూసి “ఈ 6 రూపాయలు ఎక్కడికి వెళ్ళాయి?” అని అరగంట పాటు తులనాత్మక శల్య పరీక్ష చేస్తూ వెతుకుతారు. చివరికి అవి gst లో కట్ అయ్యాయి అని తెలుతుంది. దాని అంతు తేల్చేదాకా పట్టుదలతో ఉంటారు. ఇదంతా 1వ గడిలోని



శుక్రుడు, 6వ గడిలోని కేతువు కలిసి చేస్తున్న మాయ. అయితే, మీ పట్టు దలను మీరు బలంగా మార్చుకోండి. మీ మీ రంగాలలో మీ పని మీద ఫోకస్ పెట్టండి చాలు. విజయం మీదే! మీ ఓవర్ థింకింగ్ వల్ల టెన్షన్ ఎక్కువ. అందు వల్ల, హైరానా పడకండి.

**కామెడీ పరిహారం:** హాస్యానందం పత్రికలో వచ్చే మంచి మంచి కార్టూన్లు చూసి మనసారా నవ్వుకోండి. కామెడీ కథలు చదివి రిలాక్స్ అవ్వండి.

## తుల రాశి




**ఆ**హా! ఈ యేడాది శని గ్రహం మీకు చేస్తున్న మంచి అంతా ఇంతా కాదు! మీలో లౌక్యం పాళ్ళు, మే నెలలో ఎండల్లాగా విపరీతంగా పెరుగుతాయి! సిట్యువేషన్‌ని స్మూత్‌గా హ్యాండిల్ చేస్తూ, ఎవరినీ బాధపెట్టకుండా, కాస్త ట్విస్ట్ ఇచ్చే లౌక్యం రకపు కామెడీ టైపుతో గడిపేస్తారు. మీ లౌక్యం వల్ల గొడవలు గోడదూకి పారిపోతాయి.

**కామెడీ పరిహారం:** రోజుకు ఒకసారి మాత్రం, కాయిన్ ఎగరేసి నిర్ణయం తీసుకోవాలి. అద్దం ముందు డిబేట్ పెట్టుకుని మీరు మీతో ఒకసారి ఓడిపోవాలి. షాపింగు వెళ్ళేటప్పుడు, ఇంట్లో టివి, లైట్లు ఆన్ చేసి వెళ్ళండి. కరెంటు బిల్లు పెరుగుతుందనే భయం వల్ల వేగంగా షాపింగ్ చేస్తారు.

## వృశ్చిక రాశి

**మీ**రు ఈ యేడాది, దురంధర్ సినిమాలో గూఢచారిలా గుంభనంగా ఉంటారు. మీరు ఏదైనా ప్లాన్ చేస్తే అది టాప్ సీక్రెట్‌గా ఉంటుంది. ఒక విషయం గురించి, మీ భార్య లేదా భర్త మిమ్మల్ని అడిగినా "అబ్బే ఏమీ లేదు! నాకేం తెలుసు?" ఇలాంటి సమాధానాలు ఇస్తారు. కానీ లోపల, ఆ విషయం పై ఆల్రెడీ ఫుల్ స్క్రిప్ట్ రాసేసి ఉంటారు. మీ భార్య పోపులపెట్టెలో, వేనిటీ బ్యాగ్‌లో దాచుకున్న డబ్బు ఆమెకే తెలియకుండా కాజేయగలిగేంతటి దురంధరులు మీరు! అలాగే, స్త్రీలు, తమ అత్తగార్లకు కొంచం కూడా దౌటనుమానం రాకుండా తమ భర్తలను, "నువ్వు ఎలా చెబితే అలా చేద్దాం గానీ.." అని అనిపించగలిగేంతటి దురంధరులు అయ్యుంటారు. ఇదంతా, శుక్ర గ్రహం మీ మీద కురిపిస్తున్న వరం. మరి, వరాలు వచ్చినప్పుడే జాగ్రత్తగా ఉండాలి! మీ తెలివితేటలు, మీ ప్రభావం చూసి థ్రిల్లర్ సినిమాలు కూడా ఆశ్చర్యపోతాయి! మీరు మాట్లాడే చిన్న మాట వెనుక పెద్ద అర్థం దాగి ఉంటుంది. అది అర్థం కాక, మీ చుట్టుపక్కల ఉన్నవారు జుట్టు పీక్కుంటుంటారు.



**కామెడీ పరిహారం:** తులారాశి వారికి అప్పుడప్పుడు పార్టీలు, గిఫ్టులు ఇస్తూ వారితో స్నేహం చేయండి. వారి లౌక్యం మీకు కాస్త అంటుకుంటుంది. మీ ఫోన్ పాస్‌వర్డ్ పదే పదే మార్చడం మంచిది.

## ధనూరాశి

**మీ** ఆశావాదం చూసి ఈ సంవత్సరం 'సంతోషం' మీకు ఫుల్ బ్యాటరీ మోడ్‌లో ఉంటుంది. ఉదాహరణకు, రాత్రి 2గంటలకు మీరు సెల్‌ఫోన్‌లో రీల్స్ చూస్తూ ఉంటే, మీ భార్య, "ఏంటి? ఇంకా నిద్రపోలేదా? మరి, రేపు ఆఫీసుకి ఎలా వెళ్తారు?" అని అడిగితే, దానికి మీరు, "పర్లేదులే! రేపు, నేను నిద్ర లేచినప్పుడే సూర్యుడు కూడా కాస్త ఆలస్యంగా ఉదయించి, నా టీం కు వ్యాచ్ అవుతాడు!" అని అంటారు. ఆ రేంజ్ ఆశావాదం అన్న మాట! ఏ సమస్య వచ్చినా "సరే! చూద్దాం లే..." అని నవ్వుతూ ముందుకు వెళ్తారు. మీ ట్రావెల్ ప్లాన్ల వల్ల గూగుల్‌మేప్ కూడా కన్‌ఫ్యూజ్ అవుతుంది. ఏది ఏమైనా, మీ పాజిటివ్ ఎనర్జీని, మీరు అందరికీ ఫ్రీ వైఫైలా పంచుతారు!



**కామెడీ పరిహారం:** ఈ రాశి వారు ముందుగా ఒక గ్లోబ్ కొనుక్కోండి. ప్రతిరోజూ ఉదయం, దాన్ని గిర్రున తిప్పి, అది ఎక్కడ ఆగితే అక్కడికి వెళ్లాలి...అని ఊహించుకోండి చాలు. నిజంగా వెళ్ళొద్దు! హైదరాబాద్‌లో గ్లోబులు తయారు చేసే కంపెనీ మాదే! ఈ పేపర్ కటింగ్ చూపిస్తే, 13.5% డిస్కౌంట్ ఇస్తారు. నెలకొకసారి మీ ఇంట్లో అటక మీద వస్తువులు దింపి, తుడిచి, మళ్ళీ అటక మీద పెట్టండి.

## మకర రాశి

**ఈ** యేడాది ఈ రాసి వారు సోషల్ మీడియాలో కింగులై, క్వీనులై వెలుగుతారు. ఇది తథ్యం! వీరు యూట్యూబ్‌లో, అత్తెసరు వీడియో పెట్టినా సరే, ఆరువేల లైకులు...అరు లక్షల వ్యూస్ వస్తాయి! ఫేస్ బుక్‌లో చెత్తన్నరచెత్త పోస్ట్ పెట్టిననూ...టన్నుల కొద్దీ లైకులు సంపాదించెదరు. ఇహ ఇన్‌స్టాగ్రాంలో వీరికి అడ్డే లేదు! అయితే, పక్కనే ప్రమాదం వీధికుక్కలా పొంచి ఉంది! అది చెప్పడానికే ఈ రాశి ఫలాల శీర్షిక.




వీధికుక్కలపై ప్రేమ కురిపించే సెలబ్రిటీల జోలికి, సోషల్ మీడియాలో దూరంగా ఉండండి. సోషల్ మీడియాలో నిత్యం ఏదో ఒకటి అడ్డ దిడ్డంగా వాగుతూ, తన్నుకు చచ్చే పిల్ల సెలబ్రిటీల వీడియోలు చూసి మీ మనసు, ఆరోగ్యం, టైం పాడుచేసుకోకండి. అవి పాటిస్తే, ఈ సంవత్సరం వీరికి మంచి ఫలితాలు కలవు.

**కామెడీ పరిహారం:** నలభై రెండు ఆదివారాలు 'బిర్యానీ' వ్రతం చేయించి, ఆధార్‌కార్డులో చివరి నాలుగు నంబర్లు 6754 అని మ్యాచ్ అయ్యే ఒక రచయితను సకుటుంబసపరివారసమేతంగా ఇంటికి ఆహ్వానించి... వారికి శక్తికొలదీ వెండికంచాలలో 'బిర్యానీ' దానం చేయాలి. అన్నట్టు, నా ఆధార్‌లో చివరి నాలుగు నంబర్లు మ్యాచ్ అవుతున్నాయి. చూసుకోండి మరి!

## కుంభ రాశి


ఏ గడిలో ఏ గ్రహం ఉంటే మనిషి జీవితం పూర్తి సంతోషంగా ఉంటుందో, అలా ఈ రాశి వారికి కావాల్సిన గడులలో అన్ని గ్రహాలు తిష్టవేసుకొని కూర్చోవడం వల్ల వీరు ఈ యేడు పట్టిందలా బంగారమే. మీరు ఏ పెళ్ళికి వెళ్ళినా సరే, ఏ బఫే దగ్గర తోపు లాటలు లేకుండానే మీకు సులభంగా భోజనం దొరుకుతుంది. అంత లక్కీ మీరు! మీరు బస్టాండుకు కాస్త ఆలస్యంగా వెళ్లినా సరే మీరు ఎక్కాల్సిన బస్సు మీకు అందుతుంది. మీరు ఆఫీసుకు ఆలస్యంగా వెళితే, మీ ఆఫీసులో ఏ బురద పామో దూరడం వల్ల, ఉద్యోగులు అందరూ బయటే అటూ ఇటూ తిరుగుతుంటారు. మీరు ఏ యేడాది ఎప్పుడూ 'నేను డిఫరెంట్‌గా ఆలోచిస్తాను' అని అనుకుంటారు. కానీ, అది ఎవరికీ అర్థం కాదు.



**కామెడీ పరిహారం:** ఈ రాశివారు పెద్దపులి యొక్క మీసంలోని వెంట్రుకను ఉండగా చుట్టి, వెండి తాయత్తులో ధరిస్తే సర్వశుభ దాయకం.

## మీన రాశి

**ఈ** యేడు, ఈ రాశి వారికి ఆరోగ్యం బాగుంటుంది. వీరు ఆప సోపాలు పడకుండానే, ఏ మాత్రలు మింగకుండానే... తిన్నది అరుగుతుంది. వీరి తల వెంట్రుకలు ఏ ఆయిల్ రాయకుండానే... ఏ ఖరీదైన షాంపూలు వాడకుండానే ఒత్తుగా పెరుగుతాయి. మీకు అంతగా డబ్బులు ఎక్కువ అయితే, నాకు ఇవ్వండి. నాకేం మొహమాటం లేదు. ఈ రాశి సాఫ్ట్ వేర్ ఇంజనీయర్లకు ఉద్యోగాలు పోవు. అదీ నేను చెప్పింది ఆచరిస్తే.... ఈ రాశి స్త్రీలు పుష్కలంగా బంగారం, చెంబాలు కొంటారు... అదీ నేను చెప్పింది ఆచరిస్తే... ఈ రాశి అమ్మాయిలకు బ్యూటీ పార్లర్ వెళ్ళకుండానే అందం ఇనుమడిస్తుంది...అదీ నేను చెప్పింది ఆచరిస్తే... ఈ రాశి అబ్బాయిలకు త్వరలో మంచి కన్యామణితో వివాహం ఖాయమవడం ఖాయం... అదీ నేను చెప్పింది ఆచరిస్తే... అదేంటంటే...



**కామెడీ పరిహారం:** ఈ యేడాది అంతా ప్రతి ఆది, బుధ వారాలలో రోడ్డు మీద కనిపించే ఓ 108 మందికి జీడిపప్పు ప్యాకెట్లు దానం చేస్తే, అదృష్టం మిమ్మల్ని వీధికుక్కలా వెంటాడుతుందని 'హాస్యపురాణం' లో ఉన్నట్టు గుర్తు! అన్నట్టు, విజయవాడ కాళేశ్వరావ్ మార్కెట్‌లో, పలాస నుండి వచ్చే జీడిపప్పును అమ్మే అతి పెద్ద ఏజెన్సీ మాదే! హాస్యానందం పాఠకులకు 30% డిస్కౌంట్ ఇచ్చే బాధ్యత నాకు వదిలిపెట్టండి.

### పరాభవ నామ సంవత్సర ముఖ్యమైన గ్రహచార ఫలితములు!

- తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించి, కుక్కలను పెంచే మానవతావాదులు ఎక్కువవుతారు.
- మాకే అన్నీ తెలుసు అనే యువతరం విజృంభిస్తారు.
- ఎప్పటిలాగే ఆశకు అంతు ఉండదు.
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మెదడు, బుద్ధి బాగుండాలని అందరు పూజలు, ప్రార్థనలు చేస్తారు.
- ఒక గొప్ప సత్యం– ఈ సంవత్సరం కూడా 'పక్క ఇంటి వాళ్లు చాలా బాగున్నారు' అనుకుంటారు. కానీ వాళ్లు కూడా మన ఇంటి వైపు చూసి అదే ఆలోచిస్తున్నారు అని మర్చిపోకండి.

AKSHAGNA PUBLICATIONS

# అక్షజ్ఞ పబ్లికేషన్స్

## ఆహ్వానము

## పరాభవ సంవత్సర ఉగాది పురస్కారాలు

**దీపికారెడ్డి గారు**
నాట్యగురువు

**అంజలి గారు**
మీడియా జర్నలిస్ట్

**శాంతిశ్రీ గారు**
గాయని

**అత్తలూరి విజయలక్ష్మిగారు**
రచయిత్రి

**అయ్యగారి జయలక్ష్మిగారు**
వైణికురాలు

**పురాణపండ వైజయంతి గారు**
యూ ట్యూబ్ జర్నలిస్ట్



### స్వీకర్తలు



ఆహ్వానించువారు:
**విద్యావెంకట్, బ్నిం** అక్షజ్ఞ పబ్లికేషన్స్

**తేదీ:** 21, మార్చి 2026 సాయంత్రం 6:00 గంటలకు
**వేదిక:** తెలంగాణ సారస్వత పరిషత్ హాల్, తిలక్ రోడ్, హైదరాబాద్



కథ-కథనం

యండమూరి వీరేంద్రనాథ్
యర్రంశెట్టి శాయి



# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగపిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండోవాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడోవాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. సాత్వికరావు ఆత్మహత్య ప్రయత్నంలో లలిత దగ్గరకు చేరతాడు. ఆనందరావు రాధని పెళ్ళి చేసుకోవాలనే తలంపుతో ప్లాన్లు వేస్తునే క్రమంలో...**ఆ తర్వాత...**

**"అంతే అంతే! అద్సరే కానీ వీళ్ళిద్దరూ ఏరి? పైన ఏం చేస్తున్నారు? అగ్గిపెట్టె కోసం వెతుకు తున్నారేమో? వెతకనీండి... ఉఫ్! కరెంట్ లేక చాలా ఉక్కగా ఉంది. కాసేపు బయట చల్ల గాలికి నిలబడి వస్తాను." అన్నాడు సిద్ధాంతి.**

**"అమ్మాయికి సిగరెట్ పొగ పడదు. నేనూ వస్తాను పదండి. అన్నట్టూ సన్నగా పీలగా ఉన్నారు. మీకు ఉక్క పోస్తోందా?... నన్ను చూడండి. లావుగా ఎత్తుగా ఉన్నాను. అయినా నాకేమీ పోయటం లేదు. కారణం ఆర్మీ! సైన్యం!! ప్రత్తిపాడు ఆర్మీలో చేరాలండీ!"**

**"ప్రత్తిపాడు ఆర్మీలో చేరాలా?"**

**"నాన్సెన్స్! 'ప్రతివాడు ఆర్మీలో చేరాలీ' అన్నాను".**

**"రెండు పెగ్గులకే మీకు మాట తడబడుతోంది కల్నల్ గారూ!"**

**"ఇంకో పెగ్గు అయ్యాక మనసు కూడా తడబడుతుంది. అప్పుడే గానీ నువ్వు ఇదే మాట అని అంటే ఇక్కడే షూట్ చేస్తా. బయటకి పోదాం పద. అబ్బాయి గురించి కొంచెం మాట్లాడుకోవచ్చు" అన్నాడు.**

**ఇద్దరూ లేచి బయటికొచ్చి నిలబడ్డారు.**

వాళ్ళు అలా బయటకి వెళ్ళగానే, ఆనందరావూ రాధ మిగతా సామాన్లు పైకి సర్దటం మొదలు పెట్టారు.

"కుర్రాడెలాంటివాడు?" అని అడిగాడు కల్నల్ సిగరెట్టు వెలిగిస్తూ...

"తెగ మంచోడండీ. అందులో ఏమీ అనుమానం లేదు. ఒక్క దుర్గుణం కూడా లేదు."

"అలా అని అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలరు? సిగరెట్లు కాల్చుడా?"

"ఎప్పుడో మనసు బాగోనప్పుడు ఒకటి తాగుతాడు."

"మనసెప్పుడు బాగోదు?"

"సాధారణంగా ఎప్పుడూ బాగోదు. ఎప్పుడయినా వారం పదిరోజులకోసారి ఓ గంట సేపు బావుంటుందంతే."

"ఐసీ! మరి మందు అలవాటు లేదా?"

"కొంచెం కూడా లేదు. ఎప్పుడో ఓసారి మనసు బాగోనప్పుడు ఓ పెగ్ అంతే."

"ఐసీ! మరి అమ్మాయిలు?"

"ఛా! ఛా!! అస్సలు అలాంటివాటి జోలికిపోడు."

"కొంచెం కూడా?"

"కొంచెం కూడా పోడు. లేకపోతే ఎప్పుడయినా మనసు బాగోలేనప్పుడూ, వళ్ళు బావున్నప్పుడూ అమ్మాయిల్తో కలిసి టీ తాగుతాడు."

"ఎక్కడ? రెస్టారెంట్‌లోనా?"

"కాదు. ఇంట్లోనే. పాడయి పోయిన టేబిల్ టెన్నిస్ బల్ల మీద."

"బల్ల మీద 'టీ' తాగుతాడా... చిత్రమైన అలవాటు"

"అతనికి కాదు. అమ్మాయిలే అడుగుతారు. కాదనడు."

"పరోపకారి అన్నమాట. ఐసీ! అయితే సిగరెట్లూ, కాస్త డ్రింకూ తప్ప అన్నివిధాలా యోగ్యుడన్నమాట."

"మెల్లగా అంటారేమిటి? తెగ యోగ్యుడు!... అయినా

మనిషి జీవితంలో ఏ చిన్న వ్యసనమూ లేకపోవడం మనసుకి హాని కరం! మా అల్లుడికి ఇలాంటి సిగరెట్లూ, మందులాంటి అలవాట్లు ఏవీఁ లేవు. కానీ ఏం లాభం? మా అమ్మాయిని కిర్సనాయిలు పోసి కాల్చి తగలేశాడు."

వీరభద్రరావు అదిరిపడ్డాడు "తగలేశాడా?".

"అవును! మీకో విషయం చెప్పనా? సిగరెట్టూ, మందూ లాంటి చిన్న చిన్న అలవాట్లు ఉన్నవాళ్ళకి కోపం, విసుగు లాంటి పెద్ద పెద్ద రోగాలు ఉండవండీ."

"సర్సర్లే. కుర్రాడు ఎలాంటివాడు?"

"మంచి మౌతు. గొప్ప రైతు. అద్భుతమైన రౌతు. పోతే కేవలం కౌతు".

"ఒక్క మాట నాకు అర్థం అయితే నా రివాల్వరుతో నన్ను షూట్ చెయ్యి. కాస్త అర్థం అయ్యేటట్టూ చెప్పు."

ఈ మాటలకి రామస్వామిలోని ప్రవచనకారుడు నిద్రలేచాడు.

"మౌతు అంటే నోరు. అతడి నోరు నాగలి. నోటిమాటతో ఎటువంటి పొలాన్ని అయినా స్వాధీనంలోకి తెచ్చుకుంటాడు. అతడో గొప్ప రైతు. ఎటువంటి జడురాలి బీడునైనా సేద్యం చేయగలడు. అతడో రౌతు. మదమెక్కిన గుర్రాన్ని స్వారీ చేయడంలో వాడిని మించినవాడు లేడు. అయితే పొలాన్ని సొంతం చేసుకోడు. కౌలుకి మాత్రమే తీసుకుంటాడు. అందుకే 'కౌతు".

"అయితే నా కూతుర్ని ఇచ్చెయ్యొచ్చు అంటావా?" అర్థం కాక పోయినా తెలిసినట్టూ అడిగాడు.

"కళ్ళు మూసుకుని ఇచ్చెయ్యవచ్చు!"

"పద లోపలికి పోదాం. చీకట్లో ఇద్దరే ఉన్నారు" అంటూ లోపలికి వచ్చారు.

రామస్వామి సోఫాలో కూర్చోబోయి అది అక్కడ లేకపోవటంతో వెల్లకిలా క్రింద పడి, "అమ్మా!" అని అరిచి... తడువుఁకుంటూ లేచి...

"ఇక్కడ సోఫాలూ, కుర్చీలూ ఉండాలి కదా!... ఏవి?" అన్నాడు ఆశ్చర్యంగా.

"సోఫా లేదా?" అడిగాడు వీరభద్రరావు.

"లేదు! చూడండి!!"

"లేదండి. అసలు ఇక్కడ సోఫా ఎప్పుడూ లేదు." అన్నాడు అప్పుడే కిందకి దిగిన ఆనందరావు.


"చూడు రావ్! రాధ నిన్ను చేసుకుంటానంటోంది. నీకేమో తాడూ బొంగరం ఉన్నట్లు కనబడటం లేదు. అమ్మాయి ఇష్టపడుతోంది కాబట్టీ ఓకే అంటున్నాను... కానీ అమ్మాయిని పోషించగల శక్తిసామర్థ్యాలు నీకు ఉన్నాయా అని..."

"పుష్కలంగా ఉన్నాయి డాడీ! నా హోటల్‌కి అతని బ్యాంకు వాళ్ళే అప్పు ఇచ్చారు!" అంది రాధ.

"నీకా నమ్మకం ఉంటే నాకు ఓకే!" అన్నాడు కల్నల్.

"మరింకేం... ముహూర్తం అద్భుతంగా ఉంది! మరో వంద సంవత్స






రాల వరకూ ఇలాంటి ముహూర్తం రాదు. అబ్బాయి తరపున ఎవరూ లేరు కాబట్టి అతని తరపున మనమే నిశ్చయ తాంబూలాలు ఇచ్చి పుచ్చుకోవచ్చు. శుభస్య శీఘ్రం!" అన్నాడు సిద్ధాంతి.

✦✦✦

రతీదేవి ఉక్రోషంగా భర్త వైపు చూసి–

"చూశారా! సాత్వికరావుకిచ్చి చేద్దామనుకుంటే, ఆ ఇంద్రసతి ఆ రాధని ఆనందరావుతో కలపటానికి ప్రయత్నిస్తోంది." అంది.

మన్మథుడు నవ్వుతూ, "పిచ్చిదానా" అంటూ ఏదో చెప్పబోయాడు.

అసలే రోషంగా ఉన్నామె కోపం భర్త వైపు మళ్ళింది.... "పిచ్చి... ఎవరికండీ పిచ్చి?... ఆడవాళ్ళేం మాట్లాడినా 'పిచ్చిదానా' అంటూ కొట్టిపారేయటం మీ మగాళ్ళకి అలవాటయిపోయింది. ఇంకోసారిలా 'పిచ్చిదానా' అనకండి. ఇదంతా నా కోసం చెయ్యటం లేదు. అడక్క అడక్క ఆ చదువుల తల్లి చిన్న కోరిక కోరింది. దాన్ని తీర్చటం మన బాధ్యత."

మదనుడు ఓ క్షణం ఆలోచించి...

"మంచిదానా!" అన్నాడు.

"...నువ్వంత గొడవ చేయాల్సిన అవసరం ఏముంది?... పెళ్ళి చేయాలంటే వెయ్యి అబద్ధాలు ఆడాలన్నారే గానీ పెళ్ళి చెడగొట్టటానికి ఒక్క నిజం చాలు!"

"అంటే?..."

"ఆ ఆనందరావు తాలూకు ప్రియురాలు జయలక్ష్మి ఉంది కదా! ఆమెని రంగంలోకి దింపితే సరి!"

"ఏమవుతుంది?... ఆమె భయస్తురాలూ అమాయకురాలు కదా..! అక్కడ జరిగేది చూసి ఏడవటం తప్ప ఏమి చేస్తుంది?"

"పిచ్చిదానా!... పైకి మేక పిల్లల్లా కనపడే ఆడపిల్లలే అవసరం వచ్చినప్పుడు మేకులా అవుతారు. ప్రయత్నించి చూడు!" అన్నాడు.

దేవి ముఖంలోకి ఒక్కసారిగా కళ వచ్చేసింది.

"అబ్బ! ఎంత గొప్ప మెదడండీ మీది!" అని బుగ్గ మీద ముద్దాడి, ఒక్క ఉదుటున లేచి బయటకు పరిగెత్తింది.

✦✦✦

పెదనాన్న అనుమతితో ఆనందరావుకి తొలి రోజు శుశ్రూష చెయ్యటానికి జయలక్ష్మి ఆ గదిలోకి వస్తోంటే చీరకొంగు వీరభద్రరావు ముఖం మీద నుంచి జారింది.

"ఎవరు? అమ్మాయ్ రాధా?..." అన్నాడు కల్నల్.

"నేనిక్కడున్నాను డాడీ!" అంది రాధ మరో మూల నుండి.


"అయితే మరి ఈ చీర ఎవరిది?... ఎవరా అమ్మాయ్ నువ్వు?"

జయలక్ష్మి చీరకొంగుని ఒక్కలాగు లాగి వదిలించుకుని దూరంగా జరిగింది. మసక చీకట్లో కనబడుతోన్న నీడని కళ్ళు నులుముకుని చూసి...

"ఆమె జయలక్ష్మి అయుంటుంది!... ఆ పరిమళం అదే" అన్నాడు రామస్వామి.

ఆనందరావు అదిరిపడి రామస్వామి నోరు ఠక్కున మూసేశాడు.

"ఏమిటి రామస్వామిగారూ?... జయలక్ష్మి



అంటూ ఆపేశారేమిటి?" అన్నాడు వీరభద్రరావు అనుమానంగా.

"రావూ వాళ్ళ పనిమనిషి నాన్నా! టేబుల్ మీద ఉన్న ఫోటో ఆ అమ్మాయిదే".

"ఏమిటీ?... పనిమనిషి ఫోటో టేబుల్ మీద పెట్టాడా? ఏమిటోయ్ ఇదీ.... ఇలాంటి పద్ధతి నేనెక్కడా చూడలేదే!"

"ఆ పనిమనిషి మా వంశానికి ఇలవేల్పు సార్! మా ఫ్యామిలీ కోసం ఎన్నో త్యాగాలు చేసి మరణించింది. అందుకని అంత గౌరవం ఇస్తాం."

రామస్వామి అదిరిపడి "ఏమిటీ? జయలక్ష్మి చనిపోయిందా?" అని అరిచాడు.

ఆనందరావు గద్గదస్వరంతో–

"అవును రామస్వామిగారూ!" అన్నాడు.

"...మా కుటుంబం కోసం చిన్న వయసులోనే శీలత్యాగం చేసింది.

"శీల త్యాగం ఏమిటి?"

"అదే... ఐ మీన్... ప్రాణత్యాగం".

ఈ మాటలన్నీ జయలక్ష్మి నిశ్శబ్దంగా వింటోంది.

"అమ్మాయ్ రాధ! ఈ పనిమనిషి వ్యవహారమేదో నాకు అనుమానంగా ఉందమ్మా. తీగ లాగి డొంకంతా వెతికితే గానీ ఇతడి సంగతి కరెక్టుగా తెలీదు."

"అబ్బే!... పనిమనిషి విషయంలో మీరు డొంక, ఆ డొంకలో ఉన్న తీగ గురించి... సందేహ పడక్కర్లేదండి" అన్నాడు ఆనందరావు కంగారుగా.

"...మా మధ్య కేవలం యజమాని, పని మనిషి సంబంధం తప్ప మరొకటి లేదు... అయినా ఆ పనిమనిషితో మా వంశానికున్న ఎటాచ్‌మెంట్స్ గురించీ, మా కుటుంబం కోసం ఆమె చేసిన త్యాగాల గురించీ, అన్నీ ముందే రాధకు చెప్పాను".


"నేను ఫోటో చూశాను. యంగ్ గర్ల్. ఆవిడ నిన్ను ప్రేమించిందేమో సాత్విక్!" అన్నది రాధ.

"ఆహ్హా ప్రేమా!?... ఆ అమ్మాయి మనసు మంచిదేమో... కానీ చూడ్డానికి..." అంటూ




నవ్వుకొమ్మచ్చి

సరసి






రామస్వామిని మళ్ళీ గోకాడు.

ఆనందరావు అతడికి అప్పుడప్పుడు ఫారిన్ కొట్టిస్తూ ఉంటాడు. ఆ కృతజ్ఞతతో హింట్ అందుకుని..."అవును! దెయ్యంలా ఉండేది... కాదు కాదు. భూతానికి దెయ్యం పట్టినట్టూ ఉండేది!" అన్నాడు.

"లేదు. నేను ఫోటో చూశాను. ఆ అమ్మాయి చాలా బావుంటుంది"అని రాధ అనే లోపులో-

కల్నల్- "అబ్బ!... అంత దరిద్రంగా ఉంటుందా?" అన్నాడు.

"కాస్తా కూస్తానా కల్నల్‌గారూ. అసలా అమ్మాయి చర్మమే తెగ మందం సార్!..." రెచ్చిపోయాడు రామస్వామి.

వీరభద్రం అతడి వైపు అనుమానంగా చూస్తూ... "ఆ అమ్మాయి చర్మం మందమని మీకెలా తెలుసు? తడివి చూశారా?..." అని అడిగాడు.

"అహహ!... తెలీటం అంటే పట్టి చూశానని కాదు... ఆడాళ్ళ చర్మం నాజూకా, గరుకా, అన్నది చూస్తే తెలీదటండీ? జీతం ఇస్తున్నప్పుడు ఆవిడ చెయ్యి తగిలి గరుకులు తీస్తాం. ఏదో రాయి... ఏమిటది?"

"ఆకురాయి."

"ఆ... ఆc. అలా రాయిలా ఉండేది ఆవిడ చర్మం. హ్హా...హ్హా... ఆకురాయి!" అంటూ తన జోక్‌కి తానే పగలబడి నవ్వసాగాడు.

వెనుకే ఉన్న జయలక్ష్మి చీకట్లో ముందు కొచ్చి రామస్వామి చెంప పగిలేటట్లు కొట్టింది.

"అమ్మో!" అంటూ అరిచాడు.

కల్నల్ అదిరిపడి "ఏమయింది స్వామీ? ఎవరో కొట్టినట్లు వినిపించింది.... ఎవర్ని ఎవరు?" అంటూ లేచి నిలబడ్డాడు.

పక్కనే నిలబడ్డ రాధ వీపు మీద ఆనంద రావు నెమ్మదిగా గిల్లాడు. తమ ఇంటి దేవత జయలక్ష్మి గురించి అలా జోకులేసినందుకు ఆ సిద్ధాంతిని సాత్త్విక్కే కొట్టాడనుకొని, అతడిని సేవ్ చేయటం కోసం-

"అదా!... అదీ... నేనే కొట్టాను డాడీ!" అంది.

"నువ్వా?... ఎందుకమ్మా అంత గట్టిగా కొట్టావ్?"

"ఆయన చెంప మీద దోమ వాలింది నాన్నా."


"ఆహాహా! మీ అమ్మాయి కళ్ళే కళ్ళండీ. చీకట్లో కూడా దోమల్ని కనిపెడుతున్నాయి" చెంప తడువుc కుంటూ ఉక్రోషంగా అన్నాడు రామస్వామి.

ఆనందరావుకి జయలక్ష్మి అక్కడే ఉన్నదన్న విషయం అర్థమైంది. "...జయలక్ష్మి నిజంగా ఒక అందాల దేవత! మీకో నగ్నసత్యం చెప్పనా సార్?" అన్నాడు.

"చీకట్లో నగ్నం కనబడదులే. చెప్పు!"

"నేను జయలక్ష్మిని ప్రేమించాను సార్!"

"అదేమిటి? ఆవిడకీ నీకూ మధ్య కేవలం యజమానికీ, పనిమనిషికీ మధ్య ఉండే సంబంధమే ఉండేదన్నావ్?" **(సశేషం)**





# పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక ఉగాది కొసమెరుపు మినీ హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు

గౌరవ న్యాయనిర్ణేత: 'కళారత్న' బ్నిం
ప్రముఖ కవి, చిత్రకారులు, కార్టూనిస్టు



**న**వ్వు నానా విధాలు... అందులో కథ కొస న మెరిసే నవ్వు లెవెలే వేరు. నవ్వుతూ వీడుకోలు చెప్పినట్లుగా వుంటుంది. మళ్ళీ మళ్ళీ నవ్వుతూ కలుద్దామని చేతిలో చెయ్యేసి వాగ్దానం చేసినట్లుగా వుంటుంది. కొద్ది మాటల కథ అయినా... హృదయాన్ని గిలిగింతలు పెడుతుంది. మోడు వారిన మనసుకు చిగురునిస్తుంది. గుర్తుకొచ్చినప్పుడల్లా పెదవులు చిరునవ్వుతో పండుతాయి.
అందుకే ఈ కొసమెరుపు మినీ హాస్య కథల పోటీ!
అండగా నిలిచిన నిండుకుండ మన రాము గారికి, పోటీలో పాల్గొన్న కథకులందరికీ చిరునవ్వుతో కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

పాఠకుల ఆదరణ కోరుకుంటూ....

**శ్రీకాంతశర్మ పాలపర్తి**

శ్రీపరాభవ నామసంత్సర యుగాది సందర్భంగా **హాస్యానందం** నిర్వహించిన **పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక ఉగాది మినీ హాస్య కథల పోటీకి** సుమారు 240 కథలు వచ్చాయి.
ఈ కథల పోటీ నిబంధనకు లోబడి **'చిన్న కథలకు'** మాత్రమే బహుమతి ఇవ్వటం జరిగింది.
అయితే **మేము ప్రకటించింది 10 కథలకు బహుమతులే! ఎక్కువ కథలు వచ్చినందువలన మరికొన్ని మంచి కథలు ఎంచుకుని మరో 5 కథలకు ప్రత్యేక బహుమతులు ప్రకటించటం జరిగింది.**
ఈ పోటీలో పాల్గొన్న రచయితలకు, రచయిత్రులకు అభినందనలు. బహుమతి పొందిన వారికి శుభాకాంక్షలు.
ఈ పోటీని వారి తల్లిదండ్రులపేరిట నిర్వహించిన **శ్రీ శ్రీకాంతశర్మగారికి ధన్యవాదాలు.**
**బహుమతి పొందిన కథలు 18వ పేజీ నుండి 32 పేజీల వరకు ఇవ్వటం జరిగింది.**
ఈ కథలన్ని చదివి ఆస్వాదిస్తారని ఆశిస్తూ...

**-ఎడిటర్**


| | | |
|---|---|---|
| నావీడడ! | -సరసి | -18 |
| బ్రేకప్ | -సి. యమున | -19 |
| నేనొక దొంగని! | -ఆదోని బాషా | -20 |
| ధోకా లేదు! | -డి.వి.డి.ప్రసాద్ | -21 |
| కేశానందం మహాభాగ్యం | -బుద్ధవరపు కామేశ్వరరావు | -22 |
| మొబైల్ మాంత్రికుడు | -అవధానుల విజయలక్ష్మి | -23 |
| పిచ్చి పెళ్లి | -వేలూరి ప్రమీలాశర్మ | -24 |
| శతమానం 'భవంతి' | -కోనే నాగ వెంకట ఆంజనేయులు | -25 |
| ఉప్మా పోస్టు | -హరి వెంకట రమణ | -26 |
| అదా సంగతి! | -పద్మావతి దివాకర్ల | -27 |
| **ప్రత్యేక బహుమతులు** | | |
| ట్రంకుపెట్టె | -మన్నవప్రియా సిస్టర్స్ | -28 |
| చెపితే వినదు.కొడితే!!?? | -పి.వి.రామశర్మ | -29 |
| అలక | -కట్టా రాంబాబు | -30 |
| రివెంజ్ షాపింగ్ | -గంగాధర్ వడ్లమన్నాటి | -31 |
| ఓపెన్ సీక్రెట్ | -దంతులూరి వర్మ | -32 |

ఉగాది హాస్య కథల పోటీలో 1000 రూపాయలు
బహుమతి పొందిన కథ

# నావీడడు!

**తాం**బరం పక్క వూరికి బదిలీ అయింది పీతాంబరానికి.

అది 'ఉచిత సలహాదార్ల' జన్మస్థలం. పలకరించిన వాడికి సలహా ఇవ్వకుండా వదిలి పెట్టడెవడూ ఆ వూళ్ళో.

ఓ పెద్దాయన ఎదురుపడితే "మై వైఫ్ సార్!" అని తన భార్యని పరిచయం చేసాడు పీతాంబరం.

"నా మొహానికి ఇంగ్లీషెందుకూ? చక్కగా 'నా భార్య' అని తెలుగులో చెప్పు నాయనా!" అన్నాడాయన.

"అలాగే సార్!" అని నమస్కారం చేసి, తర్వాత కనిపించిన ఆఫీసాయనతో– "నా భార్యండి!" అన్నాడు.

"నా భార్య, నా సహధర్మచారిణి, నా అనుంగు జీవిత భాగస్వామి...ఎందుకయ్యా ఇంతింత పెద్ద పెద్ద మాటలూ?... మా ఆవిడ అని మామూలు భాషలో చెప్పొచ్చుగా!" అన్నాడాయన నవ్వుతూ.
పీతాంబరం సిగ్గు పడ్డాడు.

తర్వాత "మా ఆవిడండి!" అని వినయంగా పరిచయం చేసాడొకాయనకి.

"చూడు బాబూ! ఏదో అర్జునుడో, నకులుడో ద్రౌపదిని పరిచయం చేసినట్టు 'మా' ఆవిడేంటయ్యా... 'మా ఆవిడా'? నీకొక్కడికేగా పెళ్ళాం. చక్కగా 'నా ఆవిడ!' అని చెప్పు" అని సలహా విడుదల చేసి వెళ్ళిపోయాడాయన.

'నిజమే కదా' అనుకుని, ఆనక పక్కనించి వెళుతున్న ఒకాయనతో "నా ఆవిడండి" అన్నాడు.
ఆయన వంకరగా తలతిప్పి చూస్తూ "ఆవిడ' అంటే ఎక్కడో దూరంగా వున్నావిడ!... ఇక్కడే నీ పక్కనే ఉందిగా? చక్కగా 'నా ఈవిడ!' అని చూపించు!" అన్నాడాయన భుజం తట్టి వెళ్ళిపోతూ.

భర్తని రాసుకుంటూ పక్కనే నిలబడ్డ అతని భార్య ఉలిక్కి పడి ఎడంగా జరిగింది.

'నా ఈవిడా'? కొత్తగా ఉందే పదబంధం! 'నా ఈవిడ! నా ఈవిడ!' అని నాలుగుసార్లు మనసులో ప్రాక్టీసు చేసుకుంటూ ఉండగా...ఎదురయ్యాడొక పరిచయస్తుడు.

"నమస్కారం. నా ఈడావిడండి!" అన్నాడు తడబడుతూ.


ఆయన ఒక్క క్షణం ఆగి, "నీ ఈడేనా?... ఒకే వయసు వాళ్ళన్నమాట బావుంది కానీ నాకెందుకు చెబుతున్నావ్?" అన్నాడాయన కరక్కాయ తిన్నట్టు మొహం పెట్టి.

"అదేనండి. పరిచయం చేద్దామని. నావీడడండి!" అన్నాడు పీతాంబరం.

"నావీడడా? మార్జాలం అంటే ఏవిటంటే బిడాలం అన్నాట్ట వెనకటి కొకడు." అన్నాడాయన వక్రంగా నవ్వుతూ. పీతాంబరం తత్తరపడ్డాడు! నేర్చుకున్న 'తెలుగు తెల్లారి' కలుగులో దూరింది ఆ క్షణంలో!

అయోమయం ఆశీర్వదించింది!!

"నా మతిమండా! నావీడడ కాదండి బాబూ! నాడీయవ! అదే.. యానీడవ!!...డానీ .. నాడీ.. " అంటూ గొణుక్కుంటూ... మెటికలు విరుస్తూ, గుటకలు వేస్తున్న భర్త నెత్తి మీద 'ధబ్బు' మని ఓ దెబ్బ వేసింది అతని ధర్మపత్ని.



ఆ దెబ్బకి దబ్బుమని లోకంలోకి వచ్చి పడ్డాడు పీతాంబరం 'అయోమయ' సభ నించి! తన మీద కూడా చెయ్యి పడుతుందేమోనని భయపడి ఎదుటి వ్యక్తి మెల్లగా నిష్క్రమించాడు.

"పెద్దవాళ్ళు కొన్ని సంప్రదాయాలు పెట్టారు. కోడిగుడ్డుకు ఈకలు పీకుదామన్నట్టు వాటికి వక్రభాష్యాలు చెప్పి గొప్పనుకుంటున్నారు ఈ మధ్య కొందరు. ఎవరో ఏదో చెబితే మన బుద్ధేమయింది? చక్కగా 'మా ఆవిడ!' అనండి ఎవరడిగినా! నడవండి!..." అంది 'అతడావిడ'!!



సరసి, 9440542950

ఉగాది హాస్య కథల పోటీలో 1000 రూపాయలు బహుమతి పొందిన కథ

# బ్రేకప్

"ఎప్పుడూ లేనిది ఇలా ఒంటరిగా రావటం క్లీనర్‌లో ఆశ్చర్యం.

"జంట పావురాలులాగా కువ కువ లాడుతూ వచ్చేవారు. కొంపదీసి బ్రేకప్పా?" సర్వర్ లో కలవరం.

"బ్రేకప్పా.... ఆ బాడీ లాంగ్వేజ్ చూస్తే అలా అనిపించటం లేదు!" రిసెప్షనిస్ట్‌లో లాజికల్ ఆలోచన.

హోటల్ లోకి అడుగుపెట్టిన శశిని చూసి షాక్ అయ్యారు అందరూ.

శశి గత ఏడాదిగా అక్కడికి వచ్చే రెగ్యులర్ కస్టమర్... అదీ జంటగా. అందరితో ఫ్రెండ్లీగా కలిసిపోవటమే కాక, టిప్ కూడా భారీగా ఇచ్చే ఆ జంట అంటే అందరికీ చాలా ఇష్టం.

తమలో తామే గుస గుసలు మొదలుపెట్టారు...

అవేమీ పట్టించుకోని శశి "ఓ ప్లేట్ మసాలా దోశ, ఇంకో ప్లేట్ గారెలు, బాసుంది స్వీట్ చివరగా స్ట్రాంగ్ కాఫీ!" మొబైల్లో రీల్స్ చూసుకుంటూ... నవ్వేసుకుంటూ హుషారుగా ఆర్డర్ ఇచ్చేశాడు.

చక చకా తీసుకు వచ్చి టేబుల్ మీద పెట్టాడు బేరర్.

ఆపుకోలేక "సర్! మేడమ్ రాలేదా?" ఆరాగా అడిగాడు.

"ఇందాకటి నుండి చూస్తున్నాను... మీరందరూ చెవులు కొరికేసుకుంటున్నారు. నేను, మేడమ్ బ్రేకప్ అయ్యాము. ఇప్పుడు క్లారిటీ వచ్చిందా?" అంటూ ఫోర్క్ తో దోశను కసుక్కున కోసి లటుక్కున నోట్లో పెట్టుకున్నాడు.

అందరూ సైలెంట్ అయిపోయి, తమ పనుల్లో దూరిపోయారు.

ఆనందంగా అరగంట తిన్న తరువాత భోరుమంటూ ఏడుపు లంకించుకున్నాడు శశి.

అది విన్న అందరిలో... మళ్ళీ గుస గుసలు మొదలయ్యాయి...

"పాపం, ఉగ్గబట్టుకున్న బాధ ఇప్పుడు ఎగతన్నినట్లుంది!"

"ఏడాది అనుబంధం. మర్చి పోవటం అంత తేలికా?"


"బ్రేకప్‌తో గాయం ఖాయం!"

"ఊరుకోండి, సర్! కాలం అన్నిటినీ మాయం చేస్తుంది. మరో మేడమ్‌ను కలుపుతుంది!" అన్నాడు విషయం అంతా వింటున్న ప్రక్క టేబుల్ కస్టమర్.

"నేను ఏడుస్తుంది అందుకు కాదు!"

"మరి ఎందుకో?!"

"ఎప్పుడూ బిల్ కట్టే ఆమె వెళ్లిపోయింది. ఇహ నుండి నేనే కట్టుకోవాలని!!!" మళ్ళీ భోరు మన్నాడు శశి.





సి. యమున, 9550445911

హాస్యానందం

ఉగాది హాస్య కథల పోటీలో 1000 రూపాయలు
బహుమతి పొందిన కథ

# నేనొక దొంగని!

**అ**వును! నేనొక దొంగని. ప్రతి రోజు రాత్రి ఏదో ఒక ఇంట్లో దూరి దొంగతనం చేసి నా కడుపు నింపుకుంటూ వుంటాను. నేను పగలు పడుకుంటాను. రాత్రిళ్ళు దొంగ తనానికి బయలుదేరుతాను. నన్ను పట్టుకోవటం సులభం కాదు. పోలీసులు కూడా పట్టుకోలేని దొంగని నేను.

ఇప్పుడు సమయం అర్ధరాత్రి దాటింది. అరగంట నుంచి నేను చీకటిగా వున్న ఆ సందులో నక్కి వున్నాను. ఎదురుగా వున్న ఓ ఇంట్లో దూరటానికి సరైన సమయం కోసం ఎదురు చూస్తున్నాను. ఆ ప్రాంతంలో జన సంచారం లేదు. అదృష్టవశాత్తు చుట్టుపక్కల కుక్కలు కూడా లేవు. ఎందు కంటే నాకు కుక్కలంటే భయం. అవి నన్ను చూడగానే నా వెంట పడతాయి. ఇప్పుడు కుక్కలు లేక పోవటం వల్ల నిశ్చింతగా ఆ ఇంటిని గమని స్తున్నాను. ఈ రాత్రికి అదే ఇంటిని నేను లక్ష్యంగా చేసుకున్నాను. ఎందుకంటే ఆ ఇంట్లో ఓ స్త్రీ ఒంటరిగా ఉంది. పైగా ఇంతకు ముందే ఓసారి ఆ ఇంట్లో దూరిన అనుభవం వుంది. అందువల్ల రెండోసారి దూరటం పెద్ద కష్టం కాదు. క్రితంసారి ఆ ఇంట్లో నాకేమీ చిక్కలేదు. కాని ఈసారి ఏదో ఒకటి చిక్కుతుందనే ఆశ వుంది.

అయితే అర్ధరాత్రి దాటినా ఆ ఇంట్లో లైటు వెలుగుతోంది. ఆ స్త్రీ ఇంకా మేల్కొనే వుంది. రెండు మూడు సార్లు నేను కిటికీ దగ్గరికి వెళ్ళి రహస్యంగా లోపలికి తొంగి చూశాను. లోపల ఆ స్త్రీ నిద్రపోకుండా సెల్‌ఫోన్ చూస్తోంది. నాకు ఆమెపై పీకల దాకా కోపం వచ్చింది. అర్ధరాత్రి దాటినా ఫోన్ ఎందుకు చూస్తోంది? హాయిగా పడుకోవచ్చు కదా అని ఆ స్త్రీని తిట్టుకున్నాను. తర్వాత సెల్‌ఫోన్‌ని కూడా తిట్టుకున్నాను. ఆ మాయదారి వస్తువు వచ్చినప్పటి నుంచే జనం రాత్రిళ్ళు త్వరగా పడుకోవటం లేదు. అది మా లాంటి వారికి సమస్యగా మారింది.

మరోసారి కిటికీ దగ్గరికి వెళ్ళి లోపలికి తొంగి చూశాను. నా కళ్ళు మెరిశాయి. నేలపై పడుకున్న ఆ స్త్రీ ఫోన్ చూస్తూ చూస్తూ అలాగే నిద్రలోకి జారుకుంది.

ఫోన్‌ను ఆఫ్ కూడా చెయ్యలేదు. నేలపై వున్న ఆ ఫోన్లో ఏవేవో బొమ్మలు కదలాడుతున్నాయి.

నేను ఉత్సాహంగా కదిలాను. ఇంతకు ముందు దూరిన దారి గుండా చప్పుడు కాకుండా ఇంట్లోకి ప్రవేశించాను. మెల్లగా ఆమెను దాటి వంటింటి వైపు కదిలాను. ఉదయం నుంచీ ఏమీ తినకపోవటం వల్ల ఆకలితో నా కడుపు నకనకలాడుతోంది. వంటింట్లోకి దూరగానే గ్యాస్ స్టవ్ మీద వున్న పాల గిన్నెను చూసి నోట్లో నీళ్ళూరాయి.

మొత్తం పాలన్నీ గటగటా తాగేశాను. మత్తెక్కినట్టయింది.

తృప్తిగా వంటింట్లోంచి బయటి కొచ్చాను. నేలపై పడుకున్న ఆ స్త్రీ పక్క నుంచి వెళ్ళబోయాను. అప్పుడే చిన్న పొరపాటు జరిగింది.

నా కాలు అనుకోకుండా పరుపు పక్కనే నలపై వున్న సెల్ ఫోన్ పై పడింది.



అంతే! పెద్ద శబ్దంతో అందులో ఏదో పాట మొదలైంది.

నేను భయంతో బిగుసుకుపోయాను. ఆ శబ్దం విని నిద్రాభంగమైన ఆ స్త్రీ కళ్ళు తెరచి నన్ను చూసింది. ఆమె కళ్ళల్లో ఒక్క క్షణం భయం.

అంతలోనే పట్టరాని కోపంతో పక్కనే వున్న నీళ్ళ సీసా అందుకొని నా వైపు బలంగా విసిరింది. నేను పరుగు తీశాను. కాని అప్పటికే ఆలస్యమైంది.

నీళ్ళ సీసా సరిగ్గా నా తలకాయను తాకింది.

నేను గట్టిగా గావు కేక వేశాను.

"మ్యావ్.. మ్యావ్..!"



ఆదోని బాషా, 9440239828

ఉగాది హాస్య కథల పోటీలో 1000 రూపాయలు
బహుమతి పొందిన కథ

# ధోకా లేదు!

పార్కులో గడ్డి పీకుతూ నందు రాక కోసం ఎదురు చూస్తోంది బిందు. ఎప్పటిలా అరగంట ఆలస్యంగా వచ్చాడు నందు.

వచ్చీ రాగానే– “గడ్డి పీకుతున్నావేం బిందూ?” అనడిగాడు.

కోపంతో చర్రున లేచిన బిందు– “నీ నెత్తిమీద జుట్టు పీకలేక! ఇంతవరకూ మీ అమ్మానాన్నలను మనపెళ్ళికి ఒప్పించలేకపోయావు! ఆ సంగతి చెప్పు ముందు.” అంది.

“నా సంగతి సరే! మరి నువ్వు... నువ్వు మాత్రం ఒప్పించగలిగావా?” అనడిగాడు తనూ గడ్డిపీకే డ్యూటీలోకి దిగుతూ.

“మనమెంత గడ్డి పీకినా ఏం చెయ్యలేం!... కులాలు,అంతస్థులు అడ్డు వస్తున్నాయి వాళ్ళకి! ఒకప్పటి స్నేహితులు ఇప్పుడు బద్ధ శత్రువులుగా మారారు మన తల్లితండ్రులు. ఏం చేద్దామిప్పుడు?” అనడిగింది బిందు.

“వాళ్ళకు తెలీకుండా మనం పెళ్ళి చేసుకోలేం, అలాగని మన ప్రేమను త్యాగం చేసి దేవదాసు, పార్వతి అయిపోలేం! నాకసలే మందు వాసన కిట్టదు. మనం పెళ్ళి చేసుకుంటే వాళ్ళ పరువుపోతుందిట! ఊళ్ళో తలెత్తుకు తిరగలేరుట!” అన్నాడు నందు అప్పుడే దేవదాసు ఫోజు పెడ్తూ.



“మా ఇంట్లో కూడా ఇదే వరస... ఇదే నస. మనం పెళ్ళి చేసుకుంటేనే కదా వాళ్ళ పరువు పోయేది.” అంది బిందు సాలోచనగా.

“కొంపతీసి ఆత్మహత్య చేసుకుందామనవు కదా!” హడలెత్తి అరిచాడు నందు.

“అంత సీన్ లేదులే! నేనో ఉపాయం ఆలోచించాను.” అని నందు చెవిలో ఆమేదో చెప్పడంతో ఆనందం పట్టలేక ఆమెనెత్తుకొని గిరగిరా తిప్పాడు నందు.

నెల రోజులు గిరగిరా తిరిగేసరికి ఇద్దరికీ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలొచ్చి వెళ్ళి జాయినయ్యారు. కట్ చేస్తే... ఒకరోజు బిందు తండ్రి రామేశ్వర్రావు నందు తండ్రైన సోమేశ్వర్రావు ఇంటికొచ్చి...



“నా కూతుర్ని వల్లో వేసుకొని పెళ్ళి చేసుకోవడానికి మీ వాడికెన్ని గుండెలు? నా స్నేహితుడు సాక్షేశ్వర్రావు స్వయంగా చూసాడు వాళ్ళిద్దర్నీ... ఇప్పుడు నా పరువేం కాను?” అంటూ రంకెవేసాడు.

“నా కొడుకు బంగారం. నీ కూతురే మావాడ్ని బుట్టలో వేసుకొని ఉంటుంది, నా పరువు మాత్రం పోదా?” తగ్గేదేలే అన్నట్లు తనూ అరిచాడు సోమేశ్వర్రావు.

“ఎవరు ఎవర్ని వల్లో వేసుకున్నారో... ఎవరు ఎవర్ని బుట్టలో వేసుకున్నారో వెంటనే తేలిపోతుంది. పదండి!... బెంగుళూరు వెళ్దాం.” అన్నారు వాళ్ళ తల్లులు.

తెల్లారి పిలవని పేరంటానికొచ్చినట్లు వచ్చిన తమ తల్లితండ్రులను చూసి నందు, బిందులు తెల్లమొహం వేసి తత్తరపడ్డారు.

వాళ్ళను చూసి రామేశ్వర్రావు, సోమేశ్వర్రావు ఒకరి మీద ఒకరు ఎగిరిపడ్డారు.

“ఆగండి! నాన్నా మీకు పరువు ముఖ్యం కదా? అందుకే నేను బిందును పెళ్ళి చేసుకోలేదు.” గట్టిగా చెప్పాడు నందు.

తెల్లబోయారు ఆ నలుగురూ.

“అవును నాన్నా! మేము పెళ్ళి చేసుకోలేదు!” చెప్పింది బిందు. ఈసారి మరింత తెల్లబోయారు.

“మీ ఇద్దరికీ పరువు ముఖ్యం కనుక మేం పెళ్ళి చేసుకోలేదు. సహజీవనం చేస్తున్నాం.” చెప్పాడు నందు.

“అంటే...లివ్ ఇన్ రిలేషన్‌షిప్! కనుక మీ పరువుకేం ధోకాలేదు.” అంది బిందు.

అందరి మొహాలూ ఒక్కసారి నల్లబడ్డాయి. నోట మాట రాక... ఒకరి మొహాలొకరు చూస్తూ నోరు తెరిచి నిలబడిపోయారు ఆ నలుగురూ.

డి.వి.డి.ప్రసాద్, 9437094331

ఉగాది హాస్య కథల పోటీలో 1000 రూపాయలు
బహుమతి పొందిన కథ

# కేశానందం మహాభాగ్యం

**"యాం**డీ! లేవండి. లేచి ఆ గిన్నెలు కడిగి ఇస్తే ఎసట్లో బియ్యం పడేస్తాను." భార్య మహాభాగ్యం కేకలతో ఉలిక్కిపడి లేచిన కేశానందం...

"హూఁ!... కనీసం ఆదివారం అయినా ఒక అరగంట సేపు ఎక్కువ పడుకునే అవకాశం లేని దిక్కుమాలిన జీవితం అయిపోయిందే భాగ్యం!"

"దానికేం భాగ్యం? శుభ్రంగా పిగ్గీలోనో, సుమోటోలోనో ఫుడ్ ఆర్డర్ ఇచ్చి తెప్పిస్తే సరి... ఓ పనైపోద్ది!" సలహా పడేసింది మహాభాగ్యం.

"మా తల్లే! ఎంత మంచి చచ్చు సలహా ఇచ్చావో!" పళ్లు పిండుకుంటూ చెప్పాడు కేశానందం.

"మరి అట్టుంటది మంతోని!" వొత్తైన జుట్టును ముడి పెడుతూ చెప్పింది మహాభాగ్యం.

"ఒహో! నీకు అలా అర్థమై చచ్చిందా? సరే కానీ ఆ కొబ్బరి పీచు ఇలా పడేయ్. పళ్లు తోముకుంటాను. సారీ... సారీ అంట్లు తోముకుంటాను" మంచం మీద నుంచి బద్ధకంగా లేస్తూ చెప్పాడు కేశానందం.

✦✦✦

కాసేపటి తరువాత సోఫాలో సాఫీగా కూర్చుని, తాపీగా కాఫీ జుర్రుతూ, హేపీగా వారపత్రిక చదువుతున్న కేశానందం, ఒక్కసారిగా కెవ్వున కేక పెట్టి...

"పొద్దున్నే లేచి ఎవరి ముఖం చూసానో... ఏంటో?, పొద్దున్నే ఇలాంటి వార్త చదివాను!" అన్నాడు.

"ఇంకెవరిదీ? నా మొహమే చూసారు! ఇంతకీ ఏమైం దండీ? అలా చావు కేక పెట్టారు?" అడిగింది మహాభాగ్యం.

"అది చావు కేక కాదే. అది కెవ్వు కేక!"

"సరే, ఏదో దిక్కుమాలిన కేక. సరే ముందు విషయం చెప్పి చావండి!"


"ఏమీ లేదే. ఈ వారపత్రిక వాళ్ళు నిర్వహించిన 'కామెడీ' కథల పోటీలో నేను పంపిన 'క్రైం' కథకు బహుమతి వచ్చిందిట!"

"ఔనా? మీ కథకు బహుమతి వస్తే, మీరు గోవిందాపురం వచ్చి... గుండు కొట్టించుకుంటారని మొక్కుకున్నా! మీరు వెంటనే గోవిందాపురం వెళ్లి ఆ పని పూర్తి చేసుకుని రండి!"

"నిన్ను తగలెయ్యా! బహుమతి వచ్చింది పదివేల రూపాయలు కాదే. కేవలం పది వేల పైసలు మాత్రమే. ఆ గోవిందాపురం వెళ్లి రావడానికే రెండు వేల రూపాయలు ఖర్చు అవుతుంది!"

"బహుమతి వచ్చింది వందే అయినా అది లక్కే, అందుకే లక్కు లక్కే! మొక్కు మొక్కే!!"

"మన పెళ్లి అయిన ఈ ఆరు నెలలలో, ఇది మూడోసారి నాకు నువ్వు గుండు కొట్టించడం... అయినా నా బోడి బుర్ర మీద నీ బోడి పెత్తనం ఏమిటో నాకు అర్థం కాదు? నీ మొక్కులు కాదు కానీ, నాకు నెత్తిన క్రాఫ్ తీసుకునే యోగం లేకుండా చేసావు కదే భాగ్యం!" బావురుమన్నాడు కేశానందం.



"దానికేం భాగ్యం? క్రాఫ్ కావాలంటే హాయిగా ఓ విగ్గు కొనుక్కుని పెట్టుకోండి!" ఉచిత సలహా పడేసింది మహాభాగ్యం.

"నేనా? విగ్గు పెట్టుకోవడమా? బాగుండదేమోనే భాగ్యం?" సిగ్గు పడుతూ చెప్పాడు కేశానందం.

"విగ్గు పెట్టుకోడానికి సిగ్గు పడడం దేనికీ? ఏం నేను పెట్టుకోవడం లేదా హేమిటీ?" అంటూ తల మీద నుంచి విగ్గు తీసేసిన మహాభాగ్యం బోడి బుర్రను మొదటిసారిగా చూసిన కేశానందం...

కెవ్వున కేక పెట్టి మొదలు నరికిన మానులా మంచం మీద పడిపోయాడు.



బుద్ధవరపు కామేశ్వరరావు, 9848047322

ఉగాది హాస్య కథల పోటీలో 1000 రూపాయలు బహుమతి పొందిన కథ

# మొబైల్ మాంత్రికుడు

**వే**ణు ఒకరోజు పేపర్లో ఒక వార్త చదివాడు...

"మొబైల్–డీ–అడిక్షన్ క్లినిక్.

ఒక రోజుకి ఐదు వందల రూపాయలు. మొబైల్ లేకుండా ఎలా బ్రతకాలో మేము నేర్పిస్తాం. మొబైల్ లేకుండా వారంరోజులు గడిపిన వారికే లక్ష రూపాయలు బహుమతి!"

వేణు ఆనందంతో కుటుంబ సమావేశం పెట్టాడు.

"మనమంతా వెళ్ళిపోదాం!... ఫోన్ లేకుండా వారం రోజులు గడిపితే, మనం చెరొక లక్ష సంపాదించగలం. ఐదు లక్షల రూపాయలు వస్తే అందరం ఏకంగా చెరొక ఐ ఫోన్ కనుక్కోవచ్చు!"

అందరూ సంతోషంగా ఒప్పుకున్నారు.

క్లినిక్‌లో అడుగుపెట్టిన నిమిషానికే అలవాటు చొప్పున వేణు అడిగాడు...

"సార్ ఇక్కడ వైఫై పాస్‌వర్డ్ ఏంటి?"

డాక్టర్ నవ్వుతూ అన్నాడు–

"చూశారా? మీరు ఫోన్ వదిలినా, ఫోన్ మీలో కూర్చుంది!... దాన్ని బయటకు లాగడమే మా పని."

మొదటి రోజు లలితకు సమస్య... "కుకింగ్ యాప్ టైమర్ లేకుండా వంట ఎలా?"

రెండవ రోజు నవ్య... "ఫోన్ లేకుండా ఫ్రెండ్స్‌తో ఎలా చాటింగ్‌లు?"

మూడవ రోజు వేణు నాన్న... "ఇంతకాలం మీరు మాట్లాడరని జోకులు ఫోన్ లోనే వినేవాడిని... ఇప్పుడు మీరు నాతో మాట్లాడుతున్నారు. ఇది క్లినిక్ కాదు... ఒక మాంత్రిక లోకం!"

వారంరోజుల తర్వాత కుటుంబం అంతా కాస్త అలవాటు చేసుకుంది.

ఇంట్లో కూర్చొని మాట్లాడుకోవడం మొదలుపెట్టారు...

కాగితాల మీద గేమ్స్ ఆడారు....

వేణు గమనించాడు, పిల్లల నవ్వులు మళ్లీ ఇంట్లో మారు మ్రోగుతున్నాయి.

వాళ్ల ట్రైనింగ్ అయిపోయింది...

"గుడ్ మొత్తం మీద మీరు అందరూ మొబైల్ లేకుండా వారం రోజులు గడపడం నేర్చుకున్నారు. ఇంక ఈ అలవాటు జీవితాంతం ఉంచుకుంటే ఎంతో సంతోషంగా ఉంటారు!"

"కానీ మీ క్లినిక్కు రాకుండా ఎలా గడపగలం? వేణు అడిగాడు.

"చాలా సింపుల్ మీ మొబైల్‌లో డి అడిక్షన్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి ఇంక జీవితం అంతా మీరు మొబైల్ లేకుండా గడిపేయగలరు!" అన్నాడు డాక్టర్ తాపీగా!!





అవధానుల విజయలక్ష్మి, 9110724594

హాస్యానందం

ఉగాది హాస్య కథల పోటీలో 1000 రూపాయలు
బహుమతి పొందిన కథ

# పిచ్చి పెళ్లి

"యావండోయ్! ఆఫీస్ నించి వచ్చేటప్పుడు నాలుగు కేజీలు స్వీటు పట్టుకురండి. కాలనీలో అందరూ పార్టీ అడుగుతున్నారు."

"పార్టీ దేనికీ?... మనింట్లో పిల్లిగానీ పెద్దమనిషయ్యిందా?"

"పెళ్ళీడుకొచ్చిన పిల్లనింట్లో పెట్టుకుని ఏవిటా పరాచికాలూ? మనమ్మాయికి ప్రమోషనొచ్చిందిట. మనకన్నా ముందు కాలనీ వాళ్ళకే తెలిసింది. అందరూ వచ్చి నన్నడుగుతున్నారు."

"దానికింకా ఉద్యోగమే రాలేదు. ప్రమోషనేమిటీ?"

"అదేనండీ! రీల్స్... రీల్స్ చేస్తుందిగా!! అవి చూసి ముచ్చట పడి యూట్యూబ్‌లో గోల్డ్‌షీల్డ్ తెచ్చుకున్న గొట్టం గోకరాజు, ప్రత్యేకంగా మనమ్మాయిని ఇంటర్వ్యూ చేసి యూట్యూబ్‌లో పెడితే ఆరు లక్షల సబ్స్క్రయిబర్స్ నుంచి లైకులు, కామెంట్లూ వచ్చాయిట. మనమ్మాయిని సత్కరించి లోగో ఒకటి రిలీజ్ చేసాడట. నాకో ఫోను కొనివ్వమంటే కొనరు. ఇప్పుడు చూడండి... ఎవరో చెబితేకానీ నాకు తెలీలేదు."

"హు! ఇదో పెద్ద న్యూసు... దీనికి పార్టీ... పనీపాటా లేకపోతే సరి. అది పిచ్చి గెంతులేసి రీల్స్ చెయ్యడం, దానికి నువ్వు వంత పాడడం. బుద్ధిలేకపోతేసరి."

"మీరెన్ని తిట్టుకున్నాసరే. సాయంత్రం పార్టీ ఇవ్వాల్సిందే. దానికి బోలెడు ఫాలోయింగ్ వచ్చేసింది. ఇక ఎవరో ఒకరు ఎదురొచ్చి మరీ పెళ్లిచేసుకుంటారు చూడండి."

వాళ్ళు అనుకున్నట్టుగానే మూడునెలలు తిరిగేసరికి గొట్టం గోకరాజే ఎదురొచ్చి మరీ రీల్స్ రేవతిని పెళ్లి చేసుకోడానికి ముందుకొచ్చాడు.

✦✦✦


పబ్లిసిటీ పిచ్చోళ్ళ పెళ్లిరోజు రానేవచ్చింది. స్టేజ్ ముందున్న అతిథులతోపాటు, యూట్యూబర్ గొట్టం గోకరాజు ఫ్యాన్స్ కూడా అప్డేట్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

"ఇదేమిటండీ? పెళ్లికూతుర్ని ఇలా పిచ్చిదాని గెటప్‌లో తీసుకొచ్చారు? పైగా వీల్ చెయిర్‌లో కూచోబెట్టి తెచ్చారు... కాళ్ళు గానీ పడిపోయాయా?" కళ్యాణమండపంలో పెళ్ళికొడుకు తండ్రి కంగారు పడిపోయాడు.

"అబ్బే... ఇదంతా అల్లుడి గారి ఐడియానే అన్నయ్యగారూ! ఇలా పిచ్చి గెటప్పుల్లో పెళ్లి చేస్కుని యూట్యూబ్‌లో పెడితే లైకులు, వ్యూస్ బాగా వస్తాయిట. కావాలంటే మీ అబ్బాయిని చూడండి... కట్టుకున్న పంచి పీలికలు చేస్కుని, పిచ్చి క్రాపుతో ఎలా రెడీ అయ్యాడో!" చెప్పింది పెళ్లికూతురు తల్లి.

"అది కాదండీ! తాళికూడా ఇలా కుర్చీలో కూచునే కట్టించుకుంటుందా?" కయ్ మన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

"అదా! అదేదో పత్రికవాళ్ళు ముగ్గులపోటీ పెడితేనూ... సూర్య నమస్కారాలు పెడుతూ ముగ్గులు పెట్టడం ఎలాగో రీల్స్ చేద్దామని పదో నమస్కారంగా పాదాలు పట్టుకుని ముందుకి వంగి ముగ్గు ముందర భంగిమతో రీల్స్‌లో చూపించబోయింది. ఇంతలో మా వీధిలో బుసలు కొడుతూ పరిగెత్తుకొస్తున్న ఆంబోతు, ఒక్కసారిగా అమ్మాయిని వెనకనించి ఎత్తి తల్లకిందులుగా ముగ్గులో పడేసింది. ఆఖరి నమస్కారం పూర్తయ్యిందనిపించి లేవబోతే... ఇదిగో కాళ్ళు విరిగి కుయ్యో మొర్రోమంది. పాడు ఆంబోతు... రీల్స్‌కి వ్యూస్ పెంచిందన్నమాటే గానీ, ముహూర్తం ముందర మూడంతా పాడు చేసేసింది. ఏం చేస్తాం అన్నయ్యగారూ! మా అమ్మాయి రీల్స్‌కి



ఎక్కువా... యూట్యూబ్‌కి తక్కువా మరి! ముహూర్తం వచ్చేలోపు పెళ్లితంతు ఇలాగే కానివ్వాలి. తప్పేలా లేదు."

"నాన్నోయ్! ఇలాంటి పెళ్లిళ్ళకి యూట్యూబ్‌లో బోలెడంత క్రేజ్! కాదనకు ప్లీజ్!" బ్రతిమాలాడు గోకరాజు.

"పిల్లలు ముచ్చటపడుతున్నారు. కాదనకండి అన్నయ్యగారూ! ఈ దెబ్బతో పిల్లలకి సెలబ్రిటీల హోదా రాకపోతే నన్నడగండి."

"సరేలెండి. సర్దుకుపోక చస్తామా? అలాగే కానిచ్చేద్దాం." కాదన లేక తలాడించాడు వారం ముందరే ఆ ఆంబోతుకి అచ్చోసి వదిలేసిన... గొట్టం గోవిందం.



వేలూరి ప్రమీలాశర్మ, 9492535415

ఉగాది హాస్య కథల పోటీలో 1000 రూపాయలు
బహుమతి పొందిన కథ

# శతమానం 'భవంతి'

**హ**రివిల్లు రంగులతో మిలమిలా మెరిసిపోతున్న ఆ నూతన భవనం కోలాహలంగా ఉంది, అట్టహాసంగా ఉంది, హడావిడిగా ఉంది.

ఆనందరావు కట్టించిన ఆ భవన ప్రారంభోత్సవ మహోత్సవం ఘనంగా జరిగింది.

కార్యక్రమానికి హాజరైన చుట్టాలు, స్నేహితులూ ఘనమైన కానుకలు సమర్పించుకున్నారు.

ప్రారంభోత్సవ విధి శాస్త్రోక్తంగా నిర్వహించిన పురోహితుడి పాదాలకు మొక్కి ఆశీసులు అందుకున్నాడు ఆనందరావు తన కుటుంబ సభ్యులతో కలిసి.

విచ్చేసిన బంధు, మిత్ర, సపరివార సమేతులందరూ కూడా పురోహితుల వారి కాళ్ళకు మొక్కి ఆశీర్వాదాలు తీసుకుంటున్నారు.

తనకు పాద నమస్కారాలు చేసిన వాళ్లందరూ అందించిన నోట్లు రొంటిన దోపుకుంటూ ద్విగుణీకతమైన ఆనందంతో వాళ్ళందరినీ వందేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లమని ఆశీర్వదిస్తున్నారు పౌరోహిత్యుల వారు.

అది చూసి ఆనందరావు పళ్ళు (నోట్లోవి) నూరుకుంటున్నాడు.

ఖళ్ళు ఖళ్ళున దగ్గుతూ ఆశీస్సుల కోసం వచ్చిన... ఆనందరావు స్నేహితుడు దుర్గారావును కరక్కాయ చప్పరించమని సూచిస్తూ ఆయన దగ్గు త్వరగా తగ్గిపోవాలని దీవిస్తూ అక్షతలు నెత్తిన జల్లేరు పురోహితుల వారు.

ఆనందరావు ఆయన వైపు మహా కోపంగా చూస్తున్నాడు.

చాన్నాళ్లుగా కడుపునొప్పితో బాధ పడుతూ చిక్కి శల్యమైపోయిన కేశవరావుకి అల్లం రసం తాగమని సలహా యిస్తూ త్వరగా కోలుకుని బలం పుంజుకోవాలని దీవెనలు అందించారు.

ఆనందరావుకీ దీవెనలు చికాకు కలిగించాయి.


క్యాన్సర్‌తో పీడింపబడుతున్న లింగయ్యకు విభూతి పొట్లం కట్టి యిస్తూ ఆయన క్యాన్సర్ కాన్సిల్ అయిపోవాలని... ఆకాంక్షిస్తూ అక్షతలతో ఆశీసులు అందించారు.

ఆనందరావు కోపంతో రగిలి పోతున్నాడు.

మోకాళ్ళ నొప్పులతో కుంటుకుంటూ వచ్చిన కామేశ్వరరావును నువ్వుల నూనె మర్దనా చేయించుకోమని సూచించి త్వరలోనే పరుగు పెడతావని తలపై చెయ్యి పెట్టి మరీ ఆశీర్వదించారు.

అందరినీ ఆరోగ్యంగా జీవించమని పురోహితుడు అందిస్తున్న ఆ ఆశీసుల పరంపర వింటుంటే ఆనందరావు ఒళ్ళు కారం రాసుకున్నట్టు మండిపోతోంది.

శుభమా అని కోట్లు ఖర్చు పెట్టి కట్టించిన తన హాస్పిటల్ నిత్యం రోగులతో కిటకిటలాడాలని తాను ఆశిస్తుంటే... ప్రారంభోత్సవం నాడే-వచ్చిన వాళ్లందరినీ వందేళ్ళు ఆరోగ్యవంతులుగా జీవించమని ఆశీర్వదిస్తూ పైగా వాళ్ల జబ్బులకు నాటు వైద్యం చేయించుకోమని ఉచిత సలహాలు యిస్తున్న పురోహితుడిని చూస్తే ఒళ్ళు మండదా మరి ఘనత వహించిన వైద్యులు డాక్టర్ ఆనందరావు, ఎమ్ బీ బీ ఎస్, ఎమ్.ఎస్.గారికి?





కోనే నాగ వెంకట ఆంజనేయులు, 9290660220

ఉగాది హాస్య కథల పోటీలో 1000 రూపాయలు
బహుమతి పొందిన కథ

# ఉప్మా పోస్టు

'ఆకాశం ఎరుపు... ప్రియురాలి బుగ్గలు ఎరుపు... టమోటాలు ఎరుపు... అవి వేసి నేను చేసిన ఈ టమోటా ఉప్మా సగం ఎరుపు...' నానిబాబుకి పొద్దున్నే ఏదో ఒకటి ఫేసు బుక్కులో పోస్టు చేయడం అలవాటు.

అలా ఆ పొద్దుటే ఏడింటికాడ ఈ కవిత్వ పాదాలు రాసి తాను చేసిన టమోటా ఉప్మా ఫోటో, కోయక ముందు తీసిన టమోటాలు ఫోటో, తన అభిమాన నటి, యాంకర్ విశాలమైన వీపుతో వెనక్కి తిరిగి నవ్వుతూ తీసుకున్న ఫోటో పోస్టుతో పాటు పెట్టాడు.

పోస్ట్ పెట్టేసి, స్నానం పానం చేసి, ఉప్మా తినేసి వొచ్చి తన లాప్‌టాప్ ఆన్ చేసిన నానిబాబుకి వందకు పైగా లైకులు కనిపించాయి... ఆ కింద కొన్ని కామెంట్స్... 'ప్రియురాలి బుగ్గలు ఎరుపు వాహ్ మీ కవితకు నా జోహార్...'

'నా లవర్ నన్ను వొదిలి ఏడాది క్రితం వెళ్ళిపోయింది తనకు ఈ కవిత పంపిస్తా తిరిగి నా దగ్గరకు వొచ్చేస్తాడేమో అనే నమ్మకం.' ఆహా అనుకుంటూ ప్రొఫైల్ చూసాడు. 24x7 లవర్ బాయ్ అనుంది.

తరతరాలుగా, యుగ యుగాలుగా ఆడదాన్ని కించపరిచే ఈ కవితలు, కామెంట్లు ఇకపై చెల్లవు, కవికి జెండర్ ఈక్వాలిటీ గాని, సెన్సిటివిటీ గాని లేవు...ఇతన్ని ఏం చేసినా పాపం లేదు అని వుంది. ప్రొఫైల్ పిక్చర్ చూస్తే ఒక యెర్ర మందారం బొమ్మ వుంది. పేరు ఆందోళన అని వుంది. బాబోయ్ అనుకొని టెన్షన్ తగ్గడానికి టీ పెట్టుకొని తాగాడు. ఆ తరువాత వొచ్చి చూస్తే ఆ కవిత ఐదువందలపైగా షేర్స్ అయ్యి వుంది.

కామెంట్ల వరద, ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు నానిబాబు.

'ఇటువంటి చెత్త కవిత్వం రాసినందుకు వురి తీయాలి ఇతన్ని' అని ఒక కామెంట్.

భయంతో వొళ్ళంతా చెమటలు పట్టేసాయి.


కవిత్వం తో పాటు సినీనటి నగ్నవీపు షేర్ చేసినందుకు ఇతనిపై Indecent Representationof Women (Prohibition) Act 1986 కింద నమోదు చేయాలి. అని అఖిలాంధ్ర అశ్లీల నిరోధక ప్రెసిడెంటుది ఒక కామెంటు.

కామెంట్లు వేలల్లోకి వెళ్లిపోయాయి...ఆ రాత్రంతా నిద్ర పోకుండా కామెంట్లు చదువుతూ... ఎప్పుడో తెల్లారగట్ల నిద్రపోయాడు నానిబాబు.

పొద్దున్న స్నానం చేసేసి... అదేలోకం ఒళ్ళెరగకుండా నిద్ర పోయిన నానిబాబుకి మధ్యాహ్నం 'టక్..టక్..టక్..'మని తలుపు కొట్టిన చప్పుడికి మెలకువ వొచ్చింది.

తలుపు తీసి చూస్తే పోలీసులు."నా తప్పేం లేదు... నా తప్పేం లేదు, ఇంకెప్పుడూ ఫేస్బుక్కులో పోస్టులు పెట్టను!" అని ఉన్న పళంగా నానిబాబు స్పృహ తప్పి ధభీ మని కిందపడిపోయాడు.

✦✦✦



"బాబూ! నానిబాబు కళ్ళు తెరిచి చూడమ్మా ఎవులొచ్చారో?"

మొఖం మీద నీళ్లు కొట్టడంతో లేచి చూసిన నానిబాబుకి ఎదురుగా 'స్వీటీసూయ' వెనుక ఇద్దరు బౌన్సర్లతో కనిపించింది.

"ఈ ఊర్లోనే షూటింగ్‌కి వొచ్చాను, మీ పోస్టు లక్షల్లో వైరల్ అయ్యింది... నా నగ్న వీపు ఫోటో మీ కవిత్వానికి పెట్టడంతో నా ఫాన్ మెయిల్ కోట్లలో పెరిగింది, మీ అడ్రస్ కనుక్కొని మీకు పర్సనల్‌గా థాంక్స్ చెబుదామని వొచ్చాను!" అంది స్వీటీసూయ.

"మరి పోలీసులు?" నానిబాబు.

"ఆవిడకి రక్షణగాన్నయ్య మొగుడా!" అన్నాడు సీఐ.

ఈసారి నానిబాబు పడిపోకుండా పోలీసులిద్దరూ అతని రెక్కలు గట్టిగా పట్టుకున్నారు.



హరి వెంకట రమణ,9866084124

ఉగాది హాస్య కథల పోటీలో 1000 రూపాయలు
బహుమతి పొందిన కథ

# అదా సంగతి!

**"ఆంటీ!** సాయంకాలం బజారుకెళ్ళి పండగ బట్టలు కొనుక్కోవాలి, తోడు వస్తారా?" పొరుగింటి కాంతమ్మని అడిగింది చందన.

"అయ్యో స్టౌ మీద కూర పెట్టాను. నే వస్తా!" అంటూ మాడిపోయిన మొహంతో గాబరాగా ఇంట్లోకి పరుగెట్టింది కాంతం.

అరగంటకుపైగా తనతో సుత్తివేసినప్పుడు గుర్తుకురాని కూర అప్పుడే ఎలా గుర్తుకు వచ్చిందో అర్థంకాలేదు చందనకు. అది తనకు అలవాటే గనుక ఇంట్లోకెళ్ళిపోయింది చందన.

సాయంకాలం ఇంట్లో అకస్మాత్తుగా కాఫీ పొడి అయిపోవడం, పైగా ఇంటిని అతిథులు రాకూడని సమయంలో పావనం చేయడంతో కాంతం ఇంటికి వెళ్ళక తప్పలేదు వందనకు.

కాంతం మూడ్ ఎప్పుడెలా ఉంటుందో ఆ ముక్కంటికే తెలుసు. తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వెళ్ళిన వందనను సాదరంగా అహ్వానించేసరికి, వచ్చిన పని కాస్తా మర్చిపోయి, మైమర్చిపోయింది వందన. కాంతం మాటల ప్రభావానికి లొంగిపోయింది. పదినిమిషాల తర్వాత, వందన భర్త వరండాలో నిలబడి కేకేస్తే గానీ ఇహ లోకంలోకి ఊడిపడలేదు. వెంటనే ఉలిక్కిపడి లేచి– "ఆంటీ! ఇంటికి అతిథులొచ్చారు. అర్జెంట్‌గా కాఫీ పొడి కావాలి, మళ్ళీ తీర్చేస్తా!" అంది కంగారుగా.

అప్పటివరకూ ప్రసన్నంగా మాట్లాడుతున్న కాంతం మొహం కాస్తా తొక్క తీసిన కందగడ్డలా తయారైంది.

"అయ్యో! కాఫీ పొడి అయిపోయి రెండు రోజులైంది." అంటూ, 'ఇక దయ చెయ్యి!' అన్నట్లు నిలబడిందామె.

మతిపోయి ఆమె వంకే చూస్తూ చేసేది లేక బయటకు నడిచింది వందన. అపరిచితుడులో హీరోలా ఆమె ఎందుకలా హఠాత్తుగా అపరిచితురాలైపోతుందో ఎవరికీ అర్థం కాలేదు.

ఒక్క వందనకే కాదు, ఆ కాలనీలో ఉన్న అందరికీ ఆమెతో అదే అనుభవం ఎదురయ్యేది. రెండు రోజుల తర్వాత కాంతం లేని సమయంలో జరిగిన మహిళా మండలి మీటింగ్‌లో ఆ విషయం చర్చకు వచ్చింది.

"కాంతంగారి మూడ్ హఠాత్తుగా అలా మారిపోతుందెందుకో తెలియడం లేదు!" తన అనుభవాన్ని మిగతావారితో పంచుకుంది వందన.

"నీకే కాదు! అందరితోనూ ఆమె అలానే ప్రవర్తిస్తోంది, ఎందుకో మరి! ఆమెకు అత్తగారు గుర్తుకువచ్చి, ఆ కోపం మనమీద చూపిస్తోందేమో!" అంది చందన.

"అత్తగారు కాదు. పండుక్కి పట్టుచీర కొనని భర్త గుర్తుకు వస్తున్నాడేమో!" అంది నందన.


ఇలా జరుగుతున్న చర్చ మధ్యలోకి దూరింది ఆ కాలనీలోకి కొత్తగా చేరిన కల్పన.

"నాతో మాత్రం ఆమె బాగానే ప్రవర్తిస్తోందే! నేనేమీ అడగకుండానే ఏదో ఒకటి ఇస్తూనే ఉంటుంది! తనే ఖర్చుపెట్టి సినిమాక్కూడా తీసుకెళ్తుంది." అనేసరికి వెంటనే అమెను చుట్టుముట్టారందరూ.

"నీకేమైనా మంత్రాలు తెలుసా? లేక హిప్నోటైజ్ చేస్తున్నావా?" అడిగింది సాధన ఆశ్చర్యంగా.

"అంత సీనేమీ అక్కర్లేదు! ఆమె యాభై దాటినా, సింపుల్‌గా 'అక్కా!' అని పిలుస్తున్నా... మీ అందరిలా 'ఆంటీ!' అని పిలవడం లేదు." అందామె కళ్ళు తిప్పుకుంటూ.

'అదా సంగతి!' అని అందరూ ఎవరి ముక్కుమీద వాళ్ళు వేలేసుకున్నారు, పక్కవారి ముక్కు మీద వేలెయ్యకుండా!





పద్మావతి దివాకర్ల, 9040499919

ఉగాది హాస్య కథల పోటీలో 500 రూపాయలు
ప్రత్యేక బహుమతి పొందిన కథ

# ట్రంకుపెట్టె

"పరబ్రహ్మమూర్తి గారి గురించి చెప్పాలంటే, ఆయన తెరచి వుంచిన పుస్తకం, అంత తొందరగా ఎవర్నీ నమ్మడు... ఒక సారి నమ్మాడంటే, ఇక జీవితంలో వదలడు. ఎందుకనో గాని మీరన్నా, మీ ఫ్యామిలీ అన్నా బాగా నచ్చింది... అందుకనే మిమ్మల్ని పెళ్ళిచూపులకు రమ్మన్నారు. పెళ్ళి చూపుల వరకు వచ్చారు అంటే, ఇక వీరితో సంబంధం ఖాయమైనట్లే...!! " చెబుతున్నాడు పెళ్ళిచూపుల కార్యక్రమంలో మధ్యవర్తి నారాయణ పెళ్ళికొడుకు తల్లితండ్రులతో.

నారాయణ చెప్పిందంతా వింటున్నారు పెళ్ళికొడుకు తండ్రి రామారావు, తల్లి లక్ష్మీకాంతమ్మ. పక్కనే పెళ్లి కొడుకు సుధాకర్ కూర్చుని వున్నాడు.

నారాయణ మళ్ళీ అందుకున్నాడు–"పెళ్ళి చూపుల కార్యక్రమానికి మరికొద్ది సేపు సమయం వుంది!" అని గుర్తు చేస్తూ, "పరబ్రహ్మమూర్తి గారికి ఇద్దరు ఆడపిల్లలండి...పిల్లల్ని బాగా చదివించారు. ఉద్యోగాలు వచ్చినా ఆడపిల్లల్ని బయటకు పంపటం ఇష్టంలేక ఇంట్లోనే వుంచి ఇంటి పనులు నేర్పించారు. నాలుగు సంవత్సరాల క్రితం పెద్దమ్మాయి పెళ్ళిచేశాడు. ఈ వూరే పెద్దల్లుడిది కూడా!" అక్కడ ఒక పక్కగా కూర్చున్న పెద్దకూతురు, ఆమె భర్తని పరిచయం చేశాడు నారాయణ. వారివంక చూశాడు రామారావు. వాళ్ళు అప్పుడే జైలు నుంచి వచ్చిన వాళ్ళలా పిచ్చిచూపులు చూస్తున్నారు. వారి పక్కనే పరబ్రహ్మమూర్తి దంపతులు కూర్చుని వున్నారు. వారం క్రితం కళ్ళాపరేషన్ అయిందనుకుంటా, దంపతులిద్దరూ నల్ల కళ్ళద్దాలు పెట్టుకొని వున్నారు.

కొనసాగించాడు నారాయణ– 'పరబ్రహ్మమూర్తి గారు చిన్న చితకా వ్యాపారాలు చేసి బాగానే సంపాదించారు. లంకంత ఇల్లు. ఇంటికి కావాల్సిన వస్తువులు.." నారాయణ చెబుతుంటే... రామారావు ఇల్లంతా పరికించి చూశాడు.

"... తన సంపాదనలో పిల్లల ఖర్చులకు, భవిష్యత్తు అవసరాలకు చిల్లరగా కాకుండా బాగానే పెద్దగానే బయటకు తెలీకుండా, చివరకు బ్యాంకులకు కూడా తెలీకుండా, తెలిస్తే, తనకైనా, బ్యాంకులకైనా దొంగల భయం వుంటుందని, రెండు పెద్ద ట్రంకు పెట్టెల నిండా దాచి వుంచారు. అందులో ఒకటి పెద్ద అల్లుడికి వివాహ కానుకగా ఇచ్చారు. చిన్న కూతురికి ఇచ్చే ఈ ట్రంకుపెట్టె రెండోది!...' దీన్ని ఇప్పుడు చూడకూడదు. శోభనం గదిలో వుంటుంది. పెళ్ళయ్యాక వధూవరులు కలిసి, పెట్టెని తెరచి చూసుకుంటారు.." అని ఎదురుగా వున్న పెద్ద ట్రంకు పెట్టెని చూపించాడు నారాయణ.

అప్పుడు చూశారు రామారావు, సుధాకర్ ఆ ట్రంకు పెట్టెని, చాలా పెద్దది, బోషాణంలా వుంది. ఆలోచిస్తూ, ఇద్దరూ కూడా పెట్టె వంక చూస్తూ చూపు తిప్పుకోలేకపోయారు.

అప్పుడే పెళ్ళి కూతురు శ్రీదేవిని తీసుకుని వచ్చారు.

ఎంతో వినయంగా చాప మీద కూర్చుంది.

అప్పటిదాకా నిర్లక్ష్యంగా 'ఇది కాకపోతే, మరొకటి.' అని వున్న వారు ఎప్పుడైతే, ట్రంకుపెట్టెని చూశారో అప్పటినుంచి, 'పెళ్ళి కూతురు ఈ సంబంధం ఒప్పుకుంటే బాగుణ్ను' అని గట్టిగా దేవుడ్ని ప్రార్థించుకున్నారు. పెళ్ళికూతురు కూడా ఓకే అనటంతో మొత్తానికి సంబంధం ఖాయమయింది.

పెళ్ళయిపోయింది, శ్రీదేవి, సుధాకర్‌లది తొలిరాత్రి.



సుధాకర్‌కి చాలా ఆత్రుతగా వుంది. అప్పుడే శ్రీదేవి గదిలోకి వచ్చింది, పాలగ్లాసుతో. వెంటనే సుధాకర్ పాలగ్లాసు ప్రక్కన పెట్టి, శ్రీదేవిని ట్రంకుపెట్టె వద్దకు తీసుకెళ్ళాడు. సుధాకర్‌కి టెన్షన్ పెరిగిపోతుంది. వజ్రాలా? వైడూర్యాలా? బంగారమా? వెండా? ఏముంది ట్రంకుపెట్టెలో?

ఇద్దరూ కల్సి బోషాణం లాంటి ట్రంకు పెట్టెని తెరిచారు.

అంతే! సుధాకర్ మూర్ఛ ఒక్కటే తక్కువ! శ్రీదేవి నవ్వుతోంది. తోడల్లుడు, వదినగారు పెళ్ళిచూపుల సమయంలో ఎందుకలా వున్నారో?... ఎందుకలా పిచ్చిచూపులు చూస్తున్నారో? అర్థం అయింది. గట్టిగా అరవబోయాడు సుధాకర్, శ్రీదేవి చేత్తో నోరు మూసేసింది.

తెరచిన ట్రంకు పెట్టెనిండా తళతళలాడుతూ,కనువిందు చేస్తున్న రద్దయిన రెండు వేల రూపాయల నోట్ల కట్టలు నవ్వుతున్నాయి!



మన్నవప్రియా సిస్టర్స్, 6305204796

ఉగాది హాస్య కథల పోటీలో 500రూపాయలు
ప్రత్యేక బహుమతి పొందిన కథ

# చెపితే వినదు... కొడితే!!??

**“మా** ఆవిడతో చస్తున్నారా! చెపితే వినదు... కొడితే!...” అని ఆగిపోయాడు ఆనందం.

“ఆ! కొడితే!?...ఏడుస్తుందా తిరిగి కొడుతుందా?...” అనడిగాడు ఆనందరావు స్నేహితుడు శంకరం.

“అది కాదురా!” విసుక్కున్నాడు ఆనందం.

“ఓహో! పుట్టింటికి పోతుందా? పోనీ! అదీమంచిదేగా?” అన్నాడు శంకరం ఆనందాన్ని ఇంకాస్త ఉడికిస్తూ.

“అబ్బా!నువ్వేంట్రా? నన్ను చెప్పనీకుండా నువ్వే ఏవేవో ఊహించేసుకునీ నా బుర్రతింటున్నావు!” శంకరాన్ని కొట్టబోయాడు ఆనందం.

ఆనందాన్ని అడ్డుకుంటూ– “ఒరే! నువ్వే ఏదోచెప్తూ, కొడితే...అని ఆగిపోయి, ఏ విషయం చెప్పకుండా తిరిగి నన్నే కొడతావా? నేనేమీ నీ శ్రీమతిని కాదు, కొడితే పడడానికి!” అన్నాడు శంకరం.

“అది కాదురా! నేను కొడితే తనూ కొడుతోంది!” అని పూర్తి చేశాడు ఆనందం. అప్పటికే అతని మాట తడబడుతోంది. ఇంకేం మాట్లాడే స్థితిలో లేడు.

అది గమనించిన శంకరం  బేరర్ కి బిల్ తెమ్మని చెప్పాడు.

✦✦✦

మర్నాడు సాయంత్రం నేరుగా ఆనందం ఇంటికే వెళ్ళాడు శంకరం.

“ఏంటి చెల్లెమ్మా! మావాడ్ని ఈ మధ్య కొడుతున్నావుట!” అని వెళ్తూనే ఉపోద్ఘాతం లేకుండా విద్యుద్ఘాతం తగిలించినట్టన్నాడు.

“నేను కొట్టడమేంటన్నయ్య గారూ! అందులోనూ ఆయన్నా! ఇది మరీ అన్యాయం. ఏమండీ మిమ్మల్ని నేనెప్పుడన్నాకొట్టానా!? అసలు గట్టిగా తిట్టానా? చెప్పండి” అని మొగుణ్ణి కొట్టి...సారీ! తిట్టినంత పని చేసింది ఆనందం భార్య వినోద.

“ఇలా అడిగే పద్ధతి కూడా తిట్టడం లాగా లేదుటే?” అని మూలిగాడు ఆనందం.

“ఓహో! గట్టిగాఅడిగితే తిట్టడమా! ఒకవేళ తిడితే అది కొట్టడమని మీ డిక్షనరీలో ఉందన్నమాట... అదీ సంగతన్నయ్యగారూ?” దోషిని వెంటనే పట్టుకున్న పోలీస్‌లా తేల్చేసింది వినోద.

“అబ్బబ్బ! అదికాదు లేవే!” అని భార్యని కసురుకుని, “అయినా నువ్వేంట్రా! నిన్న నీతో చెప్తున్నది పూర్తిగా వినకుండా, ఇక్కడీ గొడవేంటీ! పద! బయటికి పోయి మాట్లాడుకుందాం!...” అని శంకరాన్ని బయటికి తీసుకుపోబోయాడు ఆనందం.

“అదేంకుదరదు! అయినా ఎప్పుడూ మీ మగవాళ్ళకి బయటికి వెళ్తే పెళ్ళాల మీద చాడీలు చెప్పుకోవడమేపనా!? మీరిప్పుడు బయటికిపోయి ఏం మాట్లాడుకుంటారో... అదంతా ఇక్కడే నా ముందే మాట్లాడుకోండి. నేను రెండే నిమిషాల్లో కాఫీ పట్టుకొస్తాను... ఈ లోగా నా మీదేమన్నా మాట్లాడేసుకున్నారో!!?...” అని ఇద్దరికీ వార్నింగిచ్చి, అన్నట్టుగానే రెండు నిమిషాల్లో కాఫీ కప్పులతో వచ్చింది వినోద. ఆమెవచ్చేసరికి తెగనవ్వుతున్న శంకరాన్ని, బిక్కచచ్చిపోయిన మొహంతో చూస్తున్న ఆనందాన్ని చూసి–

“ఏమైంది! నేను రాకుండా ఏం మాట్లాడేసుకోవద్దని



చెప్పానుగా!” అనడిగింది వినోద ఉక్రోషంగా.

“నువ్వెందుకు మావాడిని కొడుతున్నావో అర్ధమై, అదే... వాడు చెప్తేనేలే, నవ్వుతున్నా!”అన్నాడు శంకరం.

“హమ్మయ్య! నామీద  చాడీలేం చెప్పలేదన్న మాట. సరే! అదేంటో నాకూ చెప్తే నేనూ నవ్వుతాగా!” అంది వినోద.

ఆనందం వారిస్తున్నా వినకుండా...

“అదేనమ్మా! వాడెప్పుడైనా బయట కుదరక ఇంట్లో మందు కొడితే... నువ్వూ వాడితోపాటూ మందుకొడతానని కూర్చుంటున్నావట! పైగా ఏదో కంపెనీ కోసం ఏ బీరుతోనో సరిపెట్టుకోకుండా... వాడేబ్రాండ్ తాగితే అదే నువ్వూ తాగుతావట. దాన్నే వాడు, పూర్తిగా అర్థం అయేలా చెప్పకుండా... నేను కొడితే తనూ కొడుతోంది అని చెప్పాడులే...అది విని నేను మావాడిని నువ్వు కొడుతున్నావేంటనీ అడిగా!...” అన్నాడు శంకరం మళ్ళీ పగలబడి నవ్వుతూ.



పి.వి.రామశర్మ, 9490244344

ఉగాది హాస్య కథల పోటీలో 500 రూపాయలు
ప్రత్యేక బహుమతి పొందిన కథ

# అలక

**ఈ** రోజు నా ఆనందం అంతా ఇంతా కాదు. ఎందుకంటే నాకిష్టమైన నా అందాల సతీమణి పుట్టినరోజు కావడమే. అందులోను మా పెళ్ళయ్యాక వచ్చిన మొదటి పుట్టినరోజు మరి. అందుకే చాలా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయాలనుకున్నాను. అదైనా తనకు తెలియకుండా సర్ప్రైజ్ చెయ్యాలి. ఉదయమే బర్తడే గ్రీటింగ్స్ చెప్పినప్పుడు చెప్పాను ఇంట్లో ఏం చేయొద్దని బయటకెళ్ళి లంచ్ చేసి సినిమాకెళదామని, ఇంటికొచ్చాక కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకుందామని. ఆనందంగా సరే అంది.

బ్లూకలర్ చీరలో అందంగా తయారై వచ్చింది. ఇద్దరం కారులో బయలుదేరాం. కారు జ్యూయలరీ షాపు ముందు ఆపాను. ఆశ్చర్యంగా చూసింది.

సైలంట్‌గా నాతో బాటు కారు దిగింది. ఏం కొంటానో అని ఆమెలో ఉద్వేగం కన్పిస్తుంది. డైమండ్ సెక్షన్‌కి తీసుకెళ్ళాను. లవ్ సింబల్లో వున్న ఒక ఉంగరాన్ని తీసుకుంది. ఆమె కళ్ళలో ఎంతో ప్రేమ కనిపించింది. శారీ ఎంపోరియంలో తన కిష్టమైన లైట్ పింక్ కలర్ శారీ కొనిచ్చాను. తర్వాత తనకు నచ్చిన చెప్పల్స్ తీసుకుంది. లంచ్ టైమ్ కావడంతో 'తెలుగు రుచులు' రెస్టారెంట్లో తిని, ఓ రోమాంటిక్ మూవీ చూసి హుషారుగా ఇంటికి బయలు దేరాం.



శ్రీమతి ముఖంలో చెప్పలేని ఆనందం.

అదే నేను కోరుకునేది కూడా.

మా ఇంటికి కిలోమీటర్ దూరంలో చిన్న బజారు వస్తుంది. రోడ్డుకిరువైపులా బండ్ల మీద...పళ్ళు...కూరగాయలు... అవీ ఇవీ అని కాకుండా అన్నీ అమ్ముతుంటారు. టూ వీలర్ మీద వచ్చేవాళ్ళు, కార్లమీద వచ్చేవాళ్ళు ఎవరికి కావలసినవి వాళ్ళు కొనుక్కుంటూ వుంటారు... శ్రీమతి రోడ్డుకిరువైపులా వున్న బళ్ళను చూసి... నా వంక చూసింది. రోడ్డంతా బ్లాక్ చేసెయ్యడం, అక్కడంతా గోలగోలగా వుండంతో చికాగా హారన్ మోగిస్తూ కారును ముందుకు పోనిచ్చాను. అంతవరకు హుషారుగా కబుర్లు చెబుతున్న శ్రీమతి ఒక్క సారిగా సైలంటైపోయింది.

"ఏంటలా డల్ అయి పోయావు?" అడిగాను.

'ఏంలేదు' అంది ముభావంగా.

కారు ఇంటిముందు ఆపాను. ఎప్పుడూ నేను దిగాకే తనూ దిగేది. కానీ ఇప్పుడేమో ఇంజను ఆపకుండానే వెంటనే దిగిపోయి వేగంగా నడుచుకుంటూ తలుపు తీసుకొని మా బెడ్ రూములో కెళ్ళి బలంగా తలుపేసుకుంది. ఎప్పుడూ లేనది ఇప్పుడిలా ఎందుకు ప్రవర్తిస్తుందో అర్థం కాలేదు. అంతలో డెలివరీ బాయ్ వచ్చి నేను ఆర్డరు పెట్టిన కేక్ తెచ్చాడు. దాన్ని తీసుకుని డైనింగ్ టేబుల్ మీద పెట్టి బెడ్ రూమ్ తలుపు తీయబోయాను లాక్ చేసుంది. తలుపు తట్టాను తీయలేదు.

అప్పటికే సమయం ఎనిమిది గంటలు దాటింది. ఇంతవరకు లోపలేం చేస్తుందో అర్థం కావడంలేదు. టేబుల్ మీద కేక్ ఐస్ కేక్ కావడంతో కారిపోతుంది. పెద్దది కావడంతో ఫ్రిడ్జ్‌లో పెట్టే అవకాశం లేదుమరి. నిస్సహాయంగా సోఫాలో కూర్చుండి పోయాను.

అలా సోఫాను ఆనుకునే నిద్రపోయాను.

ఎంతసేపలా నిద్రపోయానో తెలీదు. ఏదో చప్పుడైతే మెలకువ వచ్చింది. పక్కనే కూర్చున్న శ్రీమతి కనిపించింది. నా మీద బాగా కోపమున్నట్టు కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి. నాతప్పేమిటో తెలియక పోయినా– "సారీ భామా!" అన్నాను. శ్రీమతి పేరు సత్యభామ.

"సారీ దేనికి" అంది సీరియస్‌గా.

"ఏమో తెలీదు. తెలియకుండా తప్పేమైనా చేసానేమోనని!"

"పెద్ద తప్పే చేసారు. చాలా ఖర్చు పెట్టి అడక్కుండానే అన్నీ కొన్నారు. అలాగే ఇరవై రూపాయలు ఖర్చు పెట్టి వాటికన్నా ఇష్టమైంది కొనలేకపోయారు."

"ఏమిటది!?" ఆశ్చర్యంగా అడిగాను.

ఆమె చెప్పింది విని పిచ్చెక్కిపోయింది. ఇంతకీ తనడిగింది... 'మొక్కజొన్న పొత్తు.'



కట్టా రాంబాబు, 9440140510

ఉగాది హాస్య కథల పోటీలో 500 రూపాయలు
ప్రత్యేక బహుమతి పొందిన కథ

# రివెంజ్ షాపింగ్

"మన ఎదురు ఫ్లాట్ వాళ్లకీ మనకి మాటలు లేవు కనుక సరిపోయింది. లేకపోతేనా..." అంది కామాక్షి మూతి బిగిస్తూ.

"ఏమైందీ? నువ్ అలా సగం చెప్పి ఊరుకుంటే నాకేవర్థమవుతుంది చెప్పు!" అయోమయంగా చూస్తూ అడిగాడు ఆమె భర్త శేఖరం.

"ఏమైందా? నా తల కొట్టేసినట్టయింది. ఆ ఎదురు ఫ్లాట్ ఆవిడ, పెద్ద పండక్కిగాను, షాపింగ్ చేసింది. పట్టు చీరలున్న మూడు గుడ్డ సంచులు, నగల బాక్స్‌లు ఉన్న రెండు ప్లాస్టిక్ బ్యాగ్లు నాకు చూపిస్తూ, వ్యంగ్యంగా ఓ నవ్వు నవ్వి మరీ లోనికి పట్టుకుపోయింది. నా అహం దెబ్బతింది... నాకు తల కొట్టేసినట్టయింది. కనుక మనం కూడా ఆవిడ చేసిన షాపింగ్‌కి రెట్టింపు షాపింగ్ చేసి... ఆమెకి చూపించి, ఆవిడపై రివెంజ్ తీర్చుకోవాల్సిందే... మీరు చప్పుడు చేయకుండా చప్పున షాపింగ్‌కి పదండి. అప్పులున్నాయ్ అని తప్పుకోవాలని చూస్తే నేనొప్పుకోను. పప్పుగుత్తితో మీ నెత్తిమీద కొట్టి, కొప్పు ముడేసుకుని ఈ క్షణమే మా పుట్టింటికి వెళ్ళిపోతాను... తర్వాత మీ చెప్పులరిగేలా నా చుట్టూ తిరిగినా నేను తిరిగిరాను!!" సూటిగా చూస్తూ... సీరియస్‌గా చెప్పింది

"అంత పని మాత్రం చేయకు! నువ్ శాంతంగా ఉండి, నన్ను కొంత ప్రశాంతంగా ఆలోచించనీ..." అని ఓ నిమిషం ముక్కు గోక్కుని ఆలోచించి...

"సరే పద! నా బెస్ట్‌ఫ్రెండ్‌కి బంగారం కమ్ బట్టల షాప్ ఉంది. ఆమె దిమ్మ తిరిగి బొమ్మ కనిపించేలా మనం ఆవిడ కన్నా రెట్టింపు పట్టు చీరలు, నగల షాపింగ్ చేద్దాం!" అన్నాడు.

ఆ ఆనందంలో ఎగిరి గంతేయలేకపోయినా, ఓ మామూలు గంతేసి... వాళ్ళాయన్ని ఊపేసి కుదిపేసి...


"థ్యాంక్సండీ!" అని చెప్పి, షాపింగ్‌కి రెడీ అయిపోయింది.

ఇద్దరూ షాపింగ్‌కి వెళ్లొచ్చి... లిఫ్ట్ దిగి... ఆ ఎదురు ఫ్లాట్ ఆవిడ బయటకు వచ్చేవరకు ఆగి, వచ్చాక, ఇద్దరూ ఐదు పట్టు చీరల బ్యాగులు, నాలుగు జ్యుయలరీ బాక్స్‌లు పట్టుకుని... గర్వంగా ఆమెకి చూపి, నవ్వుతూ లోనికి వెళ్లిపోయారు.

అలా వాళ్ళని చూసిన ఎదురు ఫ్లాట్ ఆవిడ... గబ గబా లోనికి వెళ్ళి, "తక్కువ చీరలు, నగలు కొంటావా?... ఎదురింటి వాడ్ని చూడు, పెళ్ళానికి ఎన్ని చీరలు, ఎన్ని నగలు కొన్నాడో!" అంటూ తన మొగుడితో గొడవేసుకున్న అరుపులు, శేఖరం కామాక్షిలకు వినబడ్డంతో ఇద్దరూ ఒకరి మొహం ఒకరు చిత్రంగా చూసుకుని... ఒకేసారి గట్టిగా నవ్వేసారు.

తరువాత, కామాక్షి, శేఖరం వంక చూస్తూ–

"ఆ ఎదురు ఫ్లాట్ ఆవిడకి భలే బుద్ధి చెప్పాం!... ఇవన్నీ, మీ స్నేహితుడి షాప్ నుండి తెచ్చిన ఖాళీ పట్టుచీరల బాక్స్‌లున్న బ్యాగులు, ఖాళీ నగల బాక్స్‌లు అని తెలియక, ఎదురు ఫ్లాట్ ఆవిడ, వాళ్ళాయన్ని వాయించేస్తోంది!" చెప్పింది వస్తోన్న నవ్వుని ఆపుకుంటూ.






గంగాధర్ వడ్లమన్నాటి, 9908445969

హాస్యానందం

ఉగాది హాస్య కథల పోటీలో 500 రూపాయలు
ప్రత్యేక బహుమతి పొందిన కథ

# ఓపెన్ సీక్రెట్

కనకరాజు ఒక ప్రైవేట్ సంస్థలో ఎప్పుడూ తీరికలేని ఉద్యోగం చేస్తూ ఇటీవలే పదవీ విరమణ చేసాడు.

రోజంతా కాలక్షేపం ఎలా అని బెంగపెట్టుకుంటే ఒక మిత్రుడు ఫేస్బుక్, వాట్సాప్‌లను పరిచయం చేసాడు.

కొన్ని సాహితీ గ్రూపుల్లో కథలూ, కవితలు చదివి ఓస్ వ్రాయడం ఇంతేనా అనుకొని తానూ కవిశ్రీ కలం పేరుతో కవితలు వ్రాసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, వాటికి వచ్చిన లైక్స్, కామెంట్స్ లెక్కపెట్టుకుంటూ తీరిక లేకుండా గడుపుతున్నాడు కనకరాజు.

“అర్ధరాత్రిదాకా మొబైల్ చూసుకుంటూ బారెడు పొద్దెక్కిన దాకా మంచం దిగని మీరు ఇంత పొద్దుటే ఎక్కడికి వెళ్లారు” బయటనుండి వచ్చిన కనకరాజుని కోపంగా నిలదీసింది అతని భార్య అనసూయ.

“ఇంట్లో ఈగలమోత... బయట పల్లకీ మోత అన్నట్టుంది నాపని!” అన్నాడు కనకరాజు.

“మిమ్మల్ని పల్లకీలో మోసేంత గొప్పపని ఏం చేశారో?” వెటకారంగా అంది అనసూయ.

“అదే సస్పెన్సు!”

మొహం ఆనందంతో చేటంత చేసుకుని తన వెనుక దాచిన దిన పత్రికల లోకల్ ఎడిషన్స్ ఆమె ముందుంచాడు.

వాటిలో రకరకాల హెడ్డింగ్స్‌తో కనకరాజు ఫోటో ప్రచురించి ఉన్నాయి.

కవిశ్రీ కవితకు జాతీయ పురస్కారం!

విశాఖ నివాసికి విశిష్ట బహుమతి!

కవితారంగంలో కవిశ్రీ ప్రతిభ!

మేధావుల మెప్పుపొందిన కవిశ్రీ కవిత...

అవి చదివిన అనసూయ ఉబ్బి తబ్బిబ్బు అయింది.

“ప్రత్యేక బహుమతి పొందిన మీ గురించి ఇంత గొప్పగా వ్రాసారే... మరి మొదటి బహుమతి పొందిన వారి గురించి వ్రాయలేదేమండీ?” అమాయకంగా అడిగింది అనసూయ.

“ఇప్పుడు ఏ ఊరి వార్తలు ఆ ఊరు పేపర్లోనే వస్తున్నాయి. ఈ ఊర్లో బహుమతి పొందింది నేనొక్కడినే. అందుకే నాగురించి వ్రాసారు...” గర్వంగా చెప్పాడు.

“ఓహో అలాగా... బహుమతిగా మీకు ఎంత డబ్బు ఇస్తారండీ?” ఆశగా అడిగింది అనసూయ.


“అదంతా తరువాత చెప్తాను. ఇప్పుడివన్నీ ఫేస్బుక్, వాట్సాప్‌లలో అర్జంట్‌గా పోస్ట్ చెయ్యాలి. కొద్దిసేపు నన్ను డిస్టర్బ్ చెయ్యకు!” ఆ పేపర్లుతో గదిలోకి వెళ్ళాడు కనకరాజు.

“సార్... సార్” అన్న పిలుపు విని బయటకు వచ్చింది అనసూయ.

ఎదురుగా నవ్వు ముఖంతో ఒక వ్యక్తి కనిపించాడు.

“నేను యాడ్ ఏజెన్సీ నుండి వచ్చానమ్మా! సార్ గురించి నాలుగు పేపర్లలో వేయించాం. వాటి బాలన్స్ డబ్బులు ఇస్తారని వచ్చాను!” తాను తెచ్చిన నాలుగు పేపర్లు ఆమె చేతికిచ్చాడు.

“ఇదా కవిశ్రీ కథ!?” అనుకుంటూ అమాయకంగా కనపడే అనసూయ ఆదిశక్తిలా మారి ఇంట్లోకి దారి తీసింది.





దంతులూరి వర్మ, 9492816754





## ఒక దెయ్యంతో నా ప్రేమ కథ

**రచన: యండమూరి వీరేంద్రనాథ్**

**వెల: రూ.250**

**ప్రచురణ: నవసాహితి బుక్ హౌస్, ఏలూరు రోడ్, విజయవాడ-520 002. ఫోన్:0866-2432885**




**తు**లసీదళంతో సునామీని సృష్టించి... వెన్నెల్లో ఆడపిల్లతో వెన్న చిలికించి... ఆనందోబ్రహ్మ, అభిలాష వంటి కొత్తదనం రచనలతో పాఠకుల్ని మంత్రించి... **'పుస్తకాలు చదవాలి'** అనే ఇంట్రెస్ట్ ఎందరిలోనో క్రియేట్ చేసి మరి ఎందరికో **'రాయాలి'** అనే ఆసక్తిని కలగజేసిన **యండమూరి వీరేంద్రనాథ్**- మళ్లీ ఒకసారి తన కథ-కథనం- సస్పెన్స్‌తో చేసిన మ్యూజికల్ మ్యాజిక్ **'ఒక దెయ్యంతో నా ప్రేమకథ'.**

భగవంతుడి గురించి పట్టని హీరోతో నరకంలో ఓ దెయ్యం కల వటం కథాంశం! ఇందులో ఒక అమ్మాయి రేప్ కథ, చనిపోయిన ఒక జర్నలిస్ట్ ఆత్మ కథ, ఓ పొలిటీషియన్ క్రైమ్ కథ, ఓ దొంగస్వామి మాయ కథ, ఓ లాయర్ ప్రేమ కథ, ఓ పోలీస్ పరిశోధన-ఇంకా ఎన్నో ఉన్నాయి. అన్నిటినీ కలిపి, కలగలిపి కన్ఫ్యూజన్ లేకుండా కథగా అల్లటం అంత తేలికైన విషయం కాదు.

'దేవుడు విగ్రహాల్లో ఉన్నాడో లేదో తెలియదు కానీ మనిషిలో మాత్రం తప్పకుండా ఉంటాడు' అని నమ్మే హీరో-
'భక్తిలో పొందే తాదాత్మ్యత కన్నా ఆనందం మరొకటి లేదు' అని నమ్మే హీరోయిన్-
'తాదాత్మ్యత కన్నా మించింది మరొకటి లేదు కానీ, భక్తి మాఫియాలో పడి మోసపోకండి'- అన్న కథాంశం... వీటితో నడిచేది ఈ నవల.
అంతే తప్ప ఆస్తిక నాస్తిక వాదనలతో కాదు.
ఇక దెయ్యానికి సంబంధించిన కథకి వస్తే... ఇదొక చందమామ కథ ఆ దృష్టితోనే చదవండి. -యండమూరి వీరేంద్రనాథ్

ఓ ఐదారు క్యారెక్టర్స్ మాత్రమే ఉన్న నవలలు ఎక్కువగా వస్తున్న ఈ రోజుల్లో, దాదాపు ఇరవై పాత్రలకు పైగా తీసుకుని, కథకి వాటి అవసరం తప్పని సరి అనిపించేటట్టుగా వాటిని అల్లుకుంటూ, చదరంగంలో పావులు కదిపినట్టుగా కలుపుతూ వ్రాయటం నిజంగా చాలా డిఫికల్ట్ టాస్క్. నాలుగు దశాబ్దాల క్రితం ఒకప్పటి సుప్రసిద్ధులైన రచయితలు వ్రాసినవి తప్ప... ఈ మధ్య కాలంలో ఇన్నిన్ని పాత్రలతో వచ్చిన నవలలు చాలా తక్కువ.

తిమ్మన, పోతన వంటి కవుల పద్యాల దగ్గర నుంచి, Gen Z కి సంబంధించిన ఫేస్బుక్ వరకూ, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా చర్చలతో పాటూ, జీవితానికి సంబంధించిన విలువైన కొటేషన్స్, సినిమాలు, రాగ, తాళ సంగీతం, ప్రబంధ సాహిత్యం- దేన్నీ వదలకుండా ఎన్నో విషయాలని సింపుల్‌గా చెప్పుకుపోవటం చేయి తిరిగిన రచయిత మరో నైపుణ్యం.

వేళాకోళాన్ని విసురుతూ, సరదా సెటైర్స్ జల్లుతూ, కాస్త కామెడి, బోలెడు భావుకత్వం, లోతైన చర్చ... రోలర్ కోస్టర్ రైడ్లో పాఠకుల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తూ, మోడ్రన్ నవలని ఇంత ఇంటరెస్టింగ్‌గా పాపులర్ చేయవచ్చుని మళ్లీ ప్రూవ్ చేశారు వీరేంద్రనాథ్ !

**- సత్యానంద్ పైడిపల్లి**

# సిగ్గులేకపోతే...?!

## అంశంతో నిర్వహించిన కార్టూన్ పోటీ ఫలితాలు!

పరాభవ నామ యుగాది సందర్భంగా నిర్వహించిన ఈ కార్టూన్ పోటీని విజయవంతం చేసిన కార్టూనిస్టు మిత్రులకు ధన్యవాదాలు. 'సిగ్గులేక పోతే' అనే ప్రత్యేకమైన అంశంతో నిర్వహించిన ఈ కార్టూన్ పోటీలకు విభిన్నమైన కార్టూన్లు వచ్చాయి. ప్రకటించిన విధంగా పదిమంది కార్టూనిస్టులకు 1000 రూపాయలు చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రం ఇవ్వటం జరుగుతుంది.

**బహుమతి ప్రదానోత్సవం**


మార్చి 22,2026న నిర్వహించబడుతుంది.

వేదిక:


కె.బి.ఎన్. కాలేజి, ఆడిటోరియం, విజయవాడ


సమయం:

సా॥ 6గంటలకు







బాబూ!..నేను మీ నాన్నగారింటి పొరుగింటి వాళ్ళి..ఆయనకి సీరియస్‌గా ఉంది..రేపో మాపో అన్నట్లుగా ఉన్నారు!..
సారీ!..అంకుల్!..మేం వచ్చాక ఆయన పోకపోతే సెలవు వేస్టవుతుంది..అందుకే పోయాక చెప్పండి..వస్తాం!..
nagisetty
గతుకులు, గుంతలున్న మన రోడ్లు, శత్రురాజుల దండయాత్రల నుండి చాలా సార్లు రక్షించాయి కాబట్టి వాటిని అలాగే ఉండనివ్వండి!..
సిగ్గులేకపోతే...
బహుమతి పొందిన కార్టూన్లు
మీ అమ్మను నేనసలు పట్టించుకోనని తెగ ఆడిపోసుకుంటారు గానీ.. ఇవ్వాళ ఆవిడ బర్త్‌డే సెలబ్రేట్ చెయ్యామని చెప్పింది నేనేగా.
మమ వృద్ధాశ్రమానికి దారి
చక్రవర్తి
ఖర్మ! సిగ్గు లేకుండా ప్రతీదానికి చప్పట్లు కొడుతూనే వున్నామ్
మన్నవ (ప్రియాసిస్టర్స్)


సిగ్గులేకపోతే...
బహుమతి పొందిన కార్టూన్లు
కొడుకు ప్రోగ్రెస్ కార్డుమీద సంతకం
పెట్టాలంటే ఆమ్యామ్యా కావాలా!
సిగ్గులేకపోతే సరి....!!
PROGRE
మీకు నచ్చినట్టుగా డ్రస్సు వేసుకుంటారు...నాకు నచ్చినట్టుగా
చదువుకుంటాను అంటే ఊరుకోరు
T.R. బాబు
డాక్టర్ గారు నన్ను రోజూ ఓ గంట వాకింగ్
చేయమన్నారోయ్. దానికి వెళ్తున్నా!!
CALL
అబద్ధాలు చెప్పడం, పాపమని..
నీతులు చెప్పి, వీపనుల కోసం
పచ్చి అబద్ధాలాడుతున్నారు...
సిగ్గులేకపోతే సరి..!
T. నీతులరావు,
ప్రవచనకర్త.

# సామెతలు- సందర్భాలు

KRA Satire






మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని
పరిచయం చేస్తున్న శీర్షిక! **23**

## హరి (సెల్ఫీ)

నా పేరు హరి వెంకట రమణ ( హరి ) అయ్యింది. పుట్టింది పెరిగిందీ విశాఖనగరం.

మొదటి కార్టూన్ పదో తరగతి (1992) చదువుతున్నపుడు ప్రచురణ అయింది. ఆ తరువాత సోషల్ కార్టూన్లు అనేక పత్రికల్లో వేయడం ప్రారంభించాను. 1998 'కమెండో' లో పొలిటికల్ కార్టూనిస్టుగా పరిచయమయ్యాను. మూడేళ్లు పూర్తికాలం వివిధ పత్రికల్లో పనిచేసాక. యానిమేషన్ రంగంలో హైద్రాబాద్‌లో ఆర్టిస్టుగా మరో ఐదేళ్లు పనిచేసాను.


ప్రస్తుతం యెన్ జీ ఓ రంగంలో ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా పనిచేస్తూ ఫ్రీలాన్స్ పొలిటికల్ కార్టూనిస్టుగా వివిధ పత్రికలకు, సిండికేషన్‌లకు పని చేస్తున్నాను. పూర్తికాలం, ఇంకా ఫ్రీలాన్సింగ్ కలిపి పాతికేళ్ళకు పైగా పొలిటికల్ కార్టూనింగ్‌లో వున్నాను, అయితే నిరంతరం సోషల్ కార్టూన్లు వేస్తుంటాను.

అనేక వార, మాస పత్రికల్లో నా కార్టూన్లు వొస్తుంటాయి. ఇవికాక పిల్లల అంశంపై అనేక కార్టూన్లు వేసాను. పిల్లల అంశాలపై వివిధ యెన్ జీ వోలకు వందల పోస్టర్లు రూపొందించాను.

2004లో హరికార్టూన్లు, 2006 వికాసం కార్టూన్లు, 2012 జగమే మాయ (పొలిటికల్ పాకెట్ కార్టూన్లు), 2019 ఇదీలోకం హరి కార్టూన్లు పుస్తకాలు ప్రచురించాను. పలు పత్రికలూ, సంస్థలు నిర్వహించిన కార్టూన్ల పోటీల్లో బహుమతులు వొచ్చాయి. చాలా పుస్తకాలకు ఆయా వ్యాసాలకు, ఫీచర్స్‌కి కార్టూన్లు వేసాను. కొన్ని హాస్య పుస్తకాలకు కవర్ పేజీలు, ఇన్సైడ్ కార్టూన్స్ వేసాను. హాస్యానందంతో డేటాక్వెస్ట్ యానిమేషన్ స్టూడియోలో పనిచేస్తున్నప్పటి నుంచి అనుబంధం వుంది, రాము గారి ప్రోత్సాహంతో ఇందులో కొన్ని ఫీచర్స్‌కి బొమ్మలు వేసాను.


ముఖ్యంగా గుండు సుదర్శన్ గారి ప్రశ్నలు జవాబులు శీర్షికకి మంచి స్పందన వొచ్చింది. అలాగే హాస్యానందం లో నిర్వహించిన పలు పోటీలలో బహుమతులు వొచ్చాయి.


నేను సీరియస్ సాహిత్యం కూడా రాస్తాను. బ్రిటిష్ కాలంలో బర్మా వెళ్లి తిరిగి వొచ్చిన తెలుగు కాందిశీకులపై 'బర్మాకేంపు కథలు' విశాఖలోని పెందుర్తి ప్రాంతంపై రాసిన కథలు 'చిక్కని పులి'అనే పేరుతో పుస్తకాలుగా ప్రచురించాను.















మార్నింగ్ వాకా సుబ్బాజీ?
హరి


ఏంటోరా
హైటెక్ పిండివంటలు లభించును
హరి



గొప్పసభ
హరి


పరీక్షలకు లాస్టుమినిటులో పరుగులు పెట్టి పడిపోకపోతా కాస్త ముందా...
హరి


హరి


మెజారిటీ
మైనారిటీ
హరి


వాణ్ణి ఇప్పుడు గుర్తొచ్చింది వీడు నా ఫేస్‌బుక్ ఫ్రెండు..
హరి


అఖిల భారత ఆంధ్ర గెడ్డం హీరోల సంఘం సమావేశం



# సినిమా తీద్దామా?

## సీన్ సీన్‌కో రైటర్!

గొలుసు సీరియల్

ఈ నెల రచయితలు: ✦ శ్రీకాంత్ అవధానుల ✦ హిమబిందు రామకృష్ణ ✦ చిత్తూరు సుజాత

### పదిహేడవ సీన్– గోపీకృష్ణ వర్ఝూ

**ఫ్లాష్‌బ్యాక్**

శేషాచలం పదవీ విరమణ చేశాక, వచ్చిన డబ్బులలో మిగిలిన ఓ లక్ష రూపాయతో తన చుట్టూ ఉన్న వాళ్ళని వాడుకుని ఒక చిన్న ఓటీటీ సినిమా తియ్యాలన్న ఉద్దేశంతో పరిచయస్థులను వాడుకునే క్రమంలో...

(గత సంచిక తరువాయి)

**కాంతం ఇచ్చిన చల్లని మంచినీళ్లు తాగి కాస్త స్థిమితపడిన శేషాచలం, సోఫాలో కూర్చుని తన యూనిట్ సభ్యులు వేసే వేషాలకి, చేస్తున్న ఆలోచనలకి ఎలా అడ్డుకట్ట వేసి తనమాట వినేలా చేయాలా అని, వాళ్ళలో ఎవరూ తన రచనలో గానీ, దర్శకత్వశాఖలో కానీ వేలుపెట్టకుండా ఉండేలా వాళ్ళ తోకలు కోసి సున్నం ఎలా అంటించాలా అని ఆలోచించసాగాడు.**

**ఇలా ఆలోచిస్తున్న సమయంలో, ఉన్న తలనొప్పులు చాలవన్నట్టు, 'పులి మీద పుట్రలా' ఇంకో ఉపద్రవం మరో పక్కనుండి ఎదురయ్యింది.**

**అదెలా జరిగిందంటే...**

**శేషాచలం భార్య కాంతం, "వడ్డించాను రండి! భోజనం చేద్దురు!" అన్న పిలుపుకి ఆలోచనల నుండి బయటపడి... కాళ్ళూ చేతులు కడుక్కుందామని లేచి బాత్రూమ్ వైపు నడవబోయేంతలో... కాలింగ్ బెల్ అదేపనిగా మోగసాగింది.**

'ఈ టైములో ఎవరబ్బా?' అనుకుంటూ... నిర్విరామంగా కాలింగ్ బెల్ మోగిస్తున్న వారికి నాలుగక్షింతలు వేద్దామని... డోర్ వైపు నడిచాడు.

తలుపు తీసి ఏదో అనబోతున్న శేషాచలానికి అందుకు ఆస్కారం ఇవ్వకుండా, బయట నిలబడిన ఇద్దరు రఫ్ గా కనిపిస్తున్న వాళ్ళలో ఒకడు, "నువ్వేనా సారూ సేశాచలం అంటే? నిన్ను గణేశన్న తోల్క రమ్మండు, జల్దీ నడు!" అన్నాడు.

వాడి నోట్లోని గుట్కా తుంపర్లు తనమీద, బట్టలమీద పడకుండా కాస్త వెనక్కి జరుగుతూ... "అసలు ఎవరు మీరు?... ఆ గణేష్ పిలిస్తే నేనెందుకు రావాలి? నాతో ఏమన్నా పని ఉంటే అతన్నే ఇక్కడకు రమ్మను!..." అన్నాడు కాస్త కోపంగా!

ఆ మాటలు విన్న వాళ్ళ మొహాలు ఎర్రబాఱుతుండగా– "ఇగో...పెద్దమనిషీ! అన్న ఇజ్జతిచ్చి తోల్క రమ్మంటే, గిట్ల ముద్దుగా బిలుస్తున్నం... లేకుంటే గల్లబట్టి గుంజకు పోయేటోల్లం. అన్నను నీ ఇంటికి రమ్మనేటంత గొప్పోనివా నువ్వు? ఎక్వ తక్వ లెక్కలు జెయ్యక, ఉషారీ జూపియ్యకుండ మాతోటి వస్తే పెయ్య సక్కగ ఉంటది, లేదనుకో..." అంటూ జీన్ ప్యాంట్ పైన వేసుకున్న... తెల్ల అంగీ పైకి వచ్చేట్టు ఒకసారి చేతులు పైకెత్తి ఒళ్ళు విరుచుకున్నాడు వాడు. ఆ సమయంలో బెల్ట్‌కి బిగించిన రాంపురి బాకుని, కండలు తిరిగిన వాడి చేతుల్ని గమనించిన శేషాచలం తారుకుని, ఏదో అపాయం రాబోతోందని గ్రహించి, కాస్త సామరస్య ధోరణిలో వాళ్ళతో ఇలా అన్నాడు.

"అసలు ఎవరు బాబూ మీరు? ఆ గణేషన్న ఎవరు? ఆయనకి నాతో ఏం పని?" అంటూ ప్రశ్నించాడు మొహం కాస్త దీనంగా పెట్టి.

అతని మాటలు విని ఒక్క నిముషం వాళ్ళు ఒకరి మొహాలు ఒకరు చూసుకుని, ఏదో జోక్ విన్నట్టు ఫకాలున నవ్వుకుంటూ...

"అరే బడేమియా! ఈ ఏరియా కార్పొరేటర్

గణేషన్న తెల్వదా? లేకుంటే మా తోటి దిల్లగీ జెయ్యవడితివా? నకరాలు జెయ్యకుండా సప్పుడుదాక నడు. లేకుంటే బలిమిట్ల గుంజకవోతం!" అన్న వాళ్ళ మాటలకి...

'వెధవలు కాళ్ళూ చేతులు కట్టిలాక్కుపోయేట్టుంది వీళ్ల వాలకం చూస్తుంటే!' అని మనసులో అనుకుని, "పదండి బాబూ!" అంటూ వాళ్ళతో పాటు నడిచి, వాళ్ళు తెచ్చిన జీపు వెనకసీట్లో కూర్చోవడమే తడవుగా ఒక్క ఉదుటున ముందుకి దూకింది జీపు.

అలా పదినిముషాలు గాల్లో తేలుతున్నట్టు ప్రయాణించిన జీపు, ఒక పెద్ద మూడంతస్తుల భవనం ముందాగింది.


"చల్, నడు మియా!" అని వాళ్ళలో ఒకడు గద్దించినట్టు అనగానే, అంతవరకూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తన తలకు జీపు టాపు రాడ్డు తగలకుండా చూసుకుంటూ కూర్చున్న శేషాచలం... మెల్లిగా కిందకు దిగాడు. తర్వాత వాళ్ళననుసరిస్తూ భవనంలోని ముందు హాల్లోకి ప్రవేశించాడు.

వాన్ని నీవు దీసే ఫిల్మ్ ల విలన్ లెక్క బెట్టాలె!" అంటూ ఒక పక్కన మరో కుర్చీలో కూర్చున్న తన కొడుకుని చూపించాడు.

మెల్లగా తన కళ్ళను అటు తిప్పిన శేషాచలం అతని జిమ్ బాడీ చూసి, అతనికీ, తను సెలెక్ట్ చేసుకున్న వాళ్ళకీ మధ్య తేడాను అంచనా వేసుకుంటూ... 'ఓరి భగవంతుడా! ఇదేం అవస్థ పెట్టావయ్యా నాకు' అని మనసులో అనుకుని ఏదో చెప్పబోయాడు.

అందుకు అవకాశం ఇవ్వకుండా... "ఇగో అన్నా! నేన్ జెప్పినట్టు ఇనుకుంటే నీకు మస్తు ఫాయిదా ఐతది. మీదికెల్లి మదద్ భీ జేస్త, సమజ్ జేస్కో!" అని హెచ్చరిస్తున్నట్టు అన్నాడు గణేష్.

"అది కాదన్నా! నేను కొంచెం డబ్బుతో, కొత్తవాళ్ళతో చిన్న సినిమా తీస్తున్నాను. అందులో మీ అబ్బాయికి పెద్దగా స్కోపుండదు... పెద్ద ప్రొడక్షన్ కంపెనీలో ఐతే బాగుంటుందని నా ఉద్దేశ్యం!" అంటూ తప్పించుకోజూసాడు శేషాచలం.



ఎదురుగా ఒక సింహాసనం వంటి రివాల్వింగ్ ఛైర్ లో కూర్చున్న ఖద్దరు బట్టలు ధరించిన శాల్తీని చూసి అతనే కార్పొరేటర్ అని గ్రహించి ఎందుకైనా మంచిదని ఒక నమస్కారం పడేసాడు.

దాన్ని స్వీకరిస్తున్నట్టు తల ఊపుతూ..."అన్నా! నమస్తేనే... దా! గీడగూసో" అంటూ ఒక బల్లను చూపించాడు.

అప్పటికే ఏవో సమస్యలు చెప్పుకోడానికి వచ్చిన ముగ్గురు మనుష్యుల పక్కన కూర్చున్నాడు శేషాచలం.

"అవునే అన్న! కాలనీ మందితోటి ఒక సైన్మ ఏదో దీస్తున్నవని ముచ్చట విన్న. నిన్ను గీడకు ఎందుకు బిల్చిననో ఎరుకా?... అగో! ఆడే నా కొడుకు సురేష్ యాక్టింగ్ జేస్త అని మస్తు సతాయిస్తుండు.

"ఇగో ఒక ముచ్చట జెప్తా ఇనుకో! దునియాల ఎవ్వడు ఒక్క దినాంల పెద్దగా గాడు. మస్తు కష్టం జెయ్యాలె! వేరేటోళ్ల ముచ్చట ఇడిసిపెట్టు, నా సంగతి దీస్కో! గుడంబ అమ్మిన, గుల్ఫామ్ అమ్మిన, కల్లు కాంపౌండ్ బెట్టిన, గాంజా అమ్మిన, గలీజ్ దందాలు మస్తు జేసిన... ఎనక సిరి కబ్జాలు బెట్టిన, కాలేజీలు గట్టిపిచ్చిన, కష్టం జేసిన, కమాయించి కార్పొరేటర్ ఐన.

ఇప్పుడు నేన్ జెప్పేది కష్టం జేస్తేనే ఫాయిదా ఉండేది. అందుకే నా కొడుకుని గూడ ముందుగాల నీ అసుంటోడు దీసే చిన్న సైన్మల్ల యాక్టింగ్ జేసి పెద్దగా గావాలని సోంచాయిస్తున్న... నువ్ భీ కొంచెం పైసలతోటి దీసే దాంట్ల నా కొడుకు పిరీగనె యాక్టింగ్ జేస్తడు. మీదికెల్లి

లొకేషన్లు గావాలంటే నాతోని మస్తు మునాఫ ఐతది. టండా దమాక్ తోని సోంచ్చాయించు. నా మాట ఇనుకుంటే నీవు ముంగలకి బోతవ్, లేకుంటే ఏమైద్దో జూస్కో!" అంటూ మరో మాటకి అవకాశం ఇవ్వకుండా...

నామాట కాదని నువ్వేమీ చెయ్యలేవంటూ, బెదిరిస్తున్నట్టు మాట్లా డిన అతని మాటలకు, అందులోని నిజాన్ని గుర్తెరిగి... 'ఇప్పుడేం చెయ్యాలో?' అని బుర్ర గోక్కుంటూ, ఆకాశం వంక చూస్తూ, 'ఈ సమస్యనుండి గట్టెక్కించడానికి నీకు నీవే సరి, ఓ దాసరీ!... చూపించు నాకో దారి ఉభయకుశలోపరిగా!...' అనుకుంటూ ఇంటిముఖం పట్టాడు మన దర్శక శిఖామణి.

## పద్దెనిమిదవ సీన్– ఉమాదేవి ఎర్రం

శేషాచలం వెళ్ళిపోగానే గణేష్ ఇంట్లో తండ్రీ కొడుకుల మధ్య చర్చ మెదలైంది.

"బాపూ! బాపూ... ఏందే నన్ను విలన్ను జేసినవ్? నీ యవ్వ నేనసలే జెయ్య పో!"

"ఏందిరా నువ్వనేడిది? మనం విలన్ల లెక్కనే బిడ్డా! మనకదే సూటయితదే!"

"ఏంది? నేనెట్టుంటనో మాయమ్మ (అమ్మ) నడుగు సెప్తది గీరో(హీరో) లెక్కుంటనని సిన్న ప్పుటి సంది గెన్నో సార్ల ముద్దాడిందిగదనే! నేను గా గీరో గనే సేత్త!"

'గదట్ల ముద్దాడుడేందో? సిన్నప్పుటి సంది నా కిప్పుడు రంది వెట్టవడితివి' అని మనసులో అనుకుని..."అయ్యో! మరి ముందు గనక పోతి వేంది బిడ్డా! ఆ డైరెట్టరుకు సెప్పెటోన్ని..." అన్నాడు పైకి.

"ఓరిత్త...గిప్పుడేమైందే? బాపు గిప్పుడు సెప్పు అదీగాక గా మగేసుగాడు వీరో ఏందే? ఆడి దగ్గర నేను విలనేంది? ఆణ్ణే విలను జేయిమను రాదే!"

"అబ్బో! గాని తల్లి ఆ వాడకు పెద్ద లీడర టరా! ఆమె నోట్లె నోరు బెట్టుడేందిరా? ఆమెతో నాకెందుకు లొల్లి? ఆమె సుత వీరోనే గావా లందట..."

"గదంతా నాకెరుకలే! నేను గుడ్క వీరోనే గావాలంతే!... సిన్నప్పుడు నాటకంల గుడం వీరోనే సేసిన గదా! నువ్వు జూసి గూడ గిట్లంటవ్?" మూతి తిప్పుకున్నాడు సురేష్.

"పెద్ద చిక్కే తెచ్చిండు ఈడు, ఇద్దరు హీరోల సైన్మా జెయ్యిమంటే జేత్తడో? ఎట్ల జేసుడో! ఏందో! తల పట్టుకున్నడు గణేష్.

✦✦✦

అక్కడ ప్రతిభ ఇంట్లో...

"ఆ రమేశ్ గాడితో నువ్వు నటించుడేంది? వాడొక వీధిరౌడి. మగేసుగాడంటే ఏదో పోనీలే! అనుకున్నా!... వీడితో నా కస్సలు ఇష్టం లేదు!" అంది పోచమ్మ ప్రతిభతో అప్పుడే విషయాన్ని తెలుసుకుని!

'అయ్యో! మంచిగా ఒప్పుకుందనుకున్న అమ్మ మళ్లా తిరకాసు పెడతాంది ఇప్పుడెలా?' అనుకుని అప్పటిదాకా అయిన సంభాషణ వల్ల పాటందుకుంది ప్రతిభ.


"అంతా భ్రాంతియేనా? జీవితానా వెలుగింతేనా?ఆశా నిరాశేనా? సినిమా ఛాన్స్ కలేనా?" అని.

"అయ్యో! తల్లీ అంత బాధ పడకే..." అంటున్న పోచమ్మ మాటలు వినకుండా పాట పాడుతూనే ఉంది.

ఆ పాటలా గాలిలో తేలుతూ అప్పుడే జీపు దిగి ఇంట్లోకి అడుగుపెడు తున్న శేషాచలం చెవిని చేరింది.

అనుకోకుండానే పాట వస్తున్న వైపు నడిచాడు శేషాచలం.

ఒక వైపు గణేష్ మాటలు బాధ పెడుతుంటే ఒక వైపు చల్లటి అమృతం లాంటి తేనేలూరే పాట వినిపించి...




'ఎవరబ్బా! ఇంత బాగా భానుమతి గారిలా పాడుతున్నది? నేను సింగర్ అనిత గారిని అడగాలనుకున్నా! మా బిల్డింగులోనే చక్కటి సింగర్ ఉండగా!' అనుకుని ఆ పాట వచ్చిన దిశగా వెతుక్కుంటూ వెళ్లాడు...

అది ప్రతిభ వాళ్ళ ఫ్లాటు.

'హా...ఏంటి ఆ పాడేది ప్రతిభేనా?... ప్రతిభలో ఇంత ప్రతిభ ఉందా?' అనుకొంటూ తొంగి తొంగి చూసాడు.

అవును ప్రతిభే! తను ఏదీ గమనించకుండా... తన లోకంలో

తను పాడేసుకొంటోంది..

పాటొకటే వింటున్నాడు దానిలోని భావ మేమీ బుర్ర కెక్కడం లేదు... సింగర్ గురించే ఆలోచనంతా!

హీరోయినే సింగర్ అంటే ఆ క్రేజే వేరబ్బా! ఒకప్పుడు భానుమతి గారూ అంతే కదా!... ఆవిడ సినిమాలు ఎంత హిట్టయ్యాయని... వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు ఈ విషయం భారవికి చెప్పాలి అర్జంటుగా!

శేషాచలం కళ్ల ముందు రింగులు రింగులుగా తిరిగింది భవిష్యత్తు.

మా అసోసియేషన్ వాళ్ళు తనకు ఘనంగా సన్మానం చేస్తున్నట్టు హీరోయిన్ ప్రతిభలోని ప్రతిభను వెలికి తీసిన ఘనత శేషాచలం గారిది అంటూ తనని పొగిడినట్టు అక్కడే కలల్లోకి వెళ్లిపోయాడు.

అంతలోనే ప్రతిభ ఏడుపులా వినిపించి రీలులో నుండి బయటకు వచ్చాడు.

ఇక ఆడకంఠం రడీ! మగ కంఠంని వెతుక్కోవాలంతే!

ఆ గణేశేమో కొడుక్కి పాత్ర ఇవ్వాలంటాడు ఇప్పటికే రమేశ్‌కి విలన్ పాత్ర ఇద్దామనుకున్నా ప్రతిభకు అన్నగా ఉండే విలన్ పాత్ర ఇప్పుడింకో పెద్ద విలన్‌ను ప్రవేశ పెట్టాలి... మళ్లీ ఆ పాత్ర కోసం తిప్పలు పడాలి కానీ ఆయన కార్పొరేటర్ ముందు ముందు దేనికైనా పనికొస్తాడు ఫ్రీగానే నటిస్తానంటున్నాడు కదా! ఎంత ఫ్రీగా నటించినా దాని తిప్పలు దానికే ఉంటుంది. సినిమా అన్నాక ఇవన్నీ మామూలే కానీ ఎన్ని పాత్రలుంటే అంత బడ్జెట్ ఎక్కువే! శ్రమ కూడా ఎక్కువే! అయినా ఒకటనుకున్నాక తప్పదు మరి అని తనకు తనే నచ్చ చెప్పుకుని ఇక అందరితో చర్చించాలి...అర్జంటుగా మళ్లీ ఓ మీటింగు అరేంజ్ చేయాలి.

డైరెక్టరుగా నాకీ తిప్పలన్నీ తప్పవు మరి! అని తనలో తను గొణుక్కుంటూ అక్కడి నుండి బయలు దేరాడు.

✦✦✦

ఇంట్లోకి అడుగు పెడుతూనే రుసరుసలాడుతూ ఎదురొచ్చింది కాంతం.

“ఎక్కడికెళ్లారండీ ఇంతసేపూ? చెప్పాచెయ్యకుండా వెళ్ళిపోయారు?”


“ఆ గణేష్... కార్పొరేటర్ మనుషులు నన్ను జీపులో ఎక్కించుకొని గణేష్ ఇంటికి తీసుకుపోయారు!”


“అయ్యో రామా!... నేను అనుకుంటూనే ఉన్నాను. ఇటువంటిదేదో జరుగుతుందని! నేను బజార్లో ఉన్నప్పుడు మనకు పాలు పోసే యాదవ్ కనిపించి చెప్పాడు, ఆ కార్పొరేటర్ మనుషులు మీ గురించి వెతుకుతున్నారని... అయ్యో రామా! ఆ గణేష్ ఈ వాడకంతకు రౌడీ. ఎందుకు పిల్చాడో... మీరు బయటకు ఎక్కడికైనా వెళ్తే మిమ్మల్ని ఏం చేస్తారోనని బయటకు వెళ్ళద్దు అన్నాను. ఇంతచేసినా ఇంటికే వచ్చి మిమ్మల్ని తీసుకుపోయారన్న మాట. మిమ్మల్ని ఏమీ చెయ్యలేదు కదా?”

శేషాచలం జరిగినదంతా చెప్పాడు...

ఇద్దరూ తలపట్టుకు కూర్చున్నారు....

అంతకంటే పెద్ద సమస్య గణేష్ కొడుకు సురేష్ హీరో రూపంలో వస్తుందని వాళ్లకు అప్పటికింకా తెలియదు పాపం! **(సశేషం)**



హాస్యానందం సౌజన్యంతో...

## పరాభవనామ సంవత్సర ఉగాది సందర్భంగా NCCF (North Coastal Andhra Cartoonists Forum) వారు నిర్వహించిన జాతీయస్థాయి కార్టూన్ పోటీల ఫలితాలు

ప్రతీ యేడు లాగానే ఈ ఏడాదీ పరాభవ నామ సంవత్సర ఉగాదికి హాస్యానందం నిర్వహణలో **NCCF** సభ్యుల ఆర్థిక సహాయ సహకారాలతో నిర్వహించిన ఈ కార్టూన్ల పోటీకి 54 మంది కార్టూనిస్టులు 144 కార్టూన్లు పంపారు. **NCCF** పోటీ నిర్వాహకులే ఈసారి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి వచ్చిన కార్టూన్లలో ఉత్తమం అనుకున్న వాటిని ప్రకటించిన ప్రకారం పది బహుమతులు రూ.1000 చొప్పున ఎంపిక చేయడం జరిగింది. ఈ పదే కాకుండా ఇంకా కొన్ని మంచి కార్టూన్లు ఉండడంతో జ్యూరీ తరఫున ఇంకో 5 కార్టూన్లకు రూ.500 చొప్పున బహుమతి ప్రకటించడం జరిగింది.


ఈసారి కార్టూన్లలో కాస్త వాసి తగ్గినా, పోటీకి 144 కార్టూన్ల వరకు రావడం ముదావహం. అయితే కొంతమంది కార్టూన్లు పంపేటప్పుడుJpeg బదులు png ఫైల్‌లో, 300 Dpi కన్నా తక్కువ అంటే 72, 96 Dpi లలో పంపడం వల్ల క్వాలిటి, క్లారిటీ తగ్గింది. ఇంకా కొందరు మెయిల్‌లో ఏ వివరాలు, అంటే తమ ఊరుపేరు, ఫోన్ నెంబర్ వంటివి కూడా ఇవ్వలేదు. హామీ పత్రం అన్నది చాలామంది పంపనే లేదు.


అయితే దీన్ని ఎంపికలో పరిగణనలోకి తీసుకోలేదనుకోండి. అయినా సోదర కార్టూనిస్టులు పోటీలకు పంపేటప్పుడు 300Dpi లో పంపడం, హామీ పత్రం జతచేయడం, తమ వివరాలు ఇవ్వడం వంటివి మర్చిపోరని భావిస్తూ, ఈ పోటీ విజయవంతం కావడంలో తమ వంతు సహకారం అందించిన మన తెలుగు కార్టూనిస్టులందరికీ అభినందనలు, ధన్యవాదాలు.

ఈ పోటీలో విజేతలకు అభినందనలు తెలుపుతూ, బహుమతులు రాని వారికి రాబోయే పోటీలలో విజయాలని ఆకాంక్షిస్తూ, కార్టూనిస్టులకు, పోటీలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న హాస్యానందం పత్రికకు, సంపాదకులు శ్రీ రాముగారికి హృదయ పూర్వక అభినందనలు, ధన్యవాదాలు, కృతజ్ఞతలు, నార్త్ కోస్టల్ ఆంధ్ర కార్టూనిస్టుల ఫోరం, విశాఖపట్నం తరఫున తెలియచేస్తున్నాము.


తెలుగు కార్టూన్ వర్ధిల్లాలి!!

**–NCCF పోటీ నిర్వాహక సభ్యులు.**













NORTH COASTAL ANDHRA CARTOONISTS FORUM
నిర్వహించిన కార్టూన్ పోటీలో బహుమతి పొందిన కార్టూన్లు


















NORTH COASTAL ANDHRA CARTOONISTS FORUM
నిర్వహించిన కార్టూన్ పోటీలో బహుమతి పొందిన కార్టూన్లు


# జ్యూరీ ప్రత్యేక బహుమతులు-
## రూ.500 చొప్పున 5 బహుమతులు













### బహుమతి ప్రదాన సభ

విజయవాడ, కె.బి.ఎన్ కాలేజి,
ఆడిటోరియంలో...
మార్చి 22,2026 న
సాయంకాలం 6 గంటకు
నిర్వహించబడుతుంది.



# తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం 2026

## సందర్భంగా నిర్వహిస్తున్న
## కార్టూన్ పోటీలు

### డా॥ కె.వి.రమణగారి ఆశీస్సులతో...

తొలి తెలుగు కార్టూనిస్టు **శ్రీ తలిశెట్టి రామారావు జయంతి–మే,20,**
తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా
హాస్యానందం నిర్వహిస్తున్న
ఈ కార్టూన్ పోటీలో మన కార్టూనిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని మనవి.



## తలిశెట్టి రామారావు పురస్కారం

**40,000 రూపాయల నగదు బహుమతులు**

ఇరవై ముగ్గురికి

| | |
|---|---|
| మొదటి బహుమతి– | రూ.10,000 + ప్రశంసాపత్రం |
| రెండవ బహుమతి– | రూ.6,000 + ప్రశంసాపత్రం |
| మూడవ బహుమతి– | రూ.4,000 + ప్రశంసాపత్రం |
| విశిష్ట బహుమతులు (20)– | రూ.1000 + ప్రశంసాపత్రం |

మీరు పంపే కార్టూన్లు
ఏ పోటీకి అనేది స్పష్టంగా రాయాలి!

కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపవలెను-
**hasyanandampoteelu@gmail.com**

**నిబంధనలు:**

- 300dpi లో స్కాన్ చేసి... jpeg ఫార్మెట్‌లో మెయిల్ చేయండి.
- అశ్లీల కార్టూన్లు పంపవద్దు.
- ఒకరు 4 కార్టూన్లు మాత్రమే పంపాలి.
- పరిశీలనలో ఉన్నవి, కాపీ కార్టూన్లు పంపవద్దు.
- కార్టూన్ అటాచ్ చేసేటప్పుడు మీ పేరు ఫోన్ నెంబరు తప్పనిసరిగా రాయాలి
- న్యాయనిర్ణేతలచే ఎన్నుకోబడిన కార్టూన్లకు బహుమతులు ఇవ్వబడుతుంది. ఈ విషయమై ఎలాంటి వాదోపవాదాలకు తావుండదు.
- బహుమతి పొందని కార్టూన్లు సాధారణ ప్రచురణ కింద హాస్యానందంలో ప్రచురించబడదు.
- ఫలితాలు హాస్యానందం మే,2026 సంచికలో ప్రచురించ బడుతుంది.




## శేఖర్ అవార్డు-2026

**10,000 రూపాయల నగదు బహుమతి**

ఒక్కరికే!

ప్రముఖ కార్టూనిస్టు శ్రీశేఖర్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న

**శేఖర్ అవార్డు-2026**

కార్టూన్ పోటీకి 'కుక్క ప్రేమలు' అనే అంశంతో
కార్టూన్లు ఆహ్వానిస్తున్నాం!

## బాపురమణ కార్టూన్ పురస్కారం-2026

**8,000 రూపాయల నగదు బహుమతి**

ఒక్కరికే!

2025 జనవరి నుండి 2026 జనవరి దాకా
ఏ మీడియాలోనైనా మీరు వేసిన కార్టూన్‌లోంచి
మీకు బాగా నచ్చిన కార్టూన్ ఒక్కటంటే ఒకటి పంపిస్తే
వాటిలో ఒకదానికి బాపురమణ పురస్కారం ఇస్తూ
సన్మానించాలని నిర్ణయించాము.

## అక్షజ్ఞ పురస్కారం-2026

**10,000 రూపాయల నగదు బహుమతి**

పదిమందికి

(ఒకొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున)

అక్షజ్ఞ పబ్లికేషన్ వారు నిర్వహిస్తున్న
ఈ కార్టూన్ పోటీ అంశం: **పుస్తక ప్రేమ**

(భార్యాభర్తల మధ్య జోకులు నిషిద్ధం)

## కార్టూన్లు మాకు చేరవలసిన చివరాఖరి తేదీ

**1,ఏప్రిల్,2026**



బహుమతి ప్రదానోత్సవం
మే,20న
హైదరాబాద్‌లో
నిర్వహించబడుతుంది.




## బ్రహ్మానంద పురస్కారం-2026

**5,000 రూపాయల నగదు బహుమతి**

ఐదు గురికి

(ఒకొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున)

సోదర కార్టూనిస్టుల కళా విన్యాసాలకు
ఆనందించాలని...

'కళారత్న' శ్రీబ్నింగారు

**క్యాప్షన్‌లెస్**

కార్టూన్ పోటీని నిర్వహిస్తున్నారు.
(పర్యావరణం కార్టూన్లు వద్దు బాబోయ్)

# పదానందం-30



కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | | 4 |
| | | | | 5 | 6 | | |
| 7 | | | 8 | | | | |
| | | | 9 | | | | |
| 10 | | | | | | | 11 |
| | | 12 | | 13 | | | |
| 14 | | | | | | | |
| | | | | 15 | | | |

సమాధానం వచ్చే సంచికలో!

**ఆధారాలు:**

**అడ్డం:**

1. ఇది చుట్టడమంటే మొదలుపెట్టడం (3)
5. న్యాయస్థానంలో ఒకరి పక్షాన ఉండి వాదించడం (4)
7. తిరగబడ్డ ఎండమావి (4)
9. యుద్ధం చేయడం (4)
10. పసిపిల్లలకు మాటలురావడానికి ఇది పోస్తారు. (2)
13. గొప్పవాడు, శూరుడు (4)
14. పాట ఆలపించడానికి ముఖ్యమైనవి చెదరిపోయాయి (5)
15. నవ్వుట యొక్క ధ్వన్యనుకరణం (4)

**నిలువు**

1. ఆంధ్రభోజునిగా కీర్తింపబడ్డవాడు (8)
2. సముద్రం అల్లకల్లోలంగా ఉంది (3)
3. పస, బలం (2)
4. జీవితం (3)
6. సమయం వెళ్ళబుచ్చడం (5)
8. ఒక వాయిద్యం (3)
11. ఆసుపత్రి నుంచి, జైలునుంచి బయటకు రావడం (4)
12. స్త్రీ (3)
13. అంకురం (3)

**గత సంచిక సమాధానం**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 భా | ర | 2 తం | | 3 ఆ | డం | 4 బ | రం |
| ద్ర | | 5 దు | బా | రా | | మ్మె | |
| ప | | గ | | 6 టం | 7 కా | ర | 8 ఇ |
| 9 దం | 10 డో | రా | | | క | | ల్లా |
| | లా | | 11 ఆ | క | తా | యి | లు |
| 12 రా | య | బా | రం | | శీ | | |
| | మా | | | 13 స్వ | యం | 14 వ | రం |
| 15 అ | నం | త | పు | రం | | మ్ము | |

ఇంటిల్లిపాదిని అలరిస్తున్న
ఏకైక తెలుగు హాస్యమాస పత్రిక
హాస్యానందం
చందాదారులుగా చేరండి!
నవ్వే లక్షణం మీ సొంతం చేసుకోండి!!

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# Brewstark®

Clothing



**Brewstark** is a contemporary clothing brand offering premium shirts, jeans, trousers, and T-shirts crafted with uncompromised quality and style. Blending comfort, perfect fit, and distinctive design, **Brewstark** creates versatile fashion for the passionate and ambitious.

## Brewstark

Plot # S17, Road No.10C,
Jubilee Hills, Hyderabad.
**Ph- 9 0 0 0 2 2 2 4 1 1**








Hasyanandam March-2026 RNI No. APTEL 08387/01/1/2003-TC




**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 9676444548